

ఇక ఆలయాలకు
ట్రస్టు బోర్డులు
» దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ
» ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 16 దేవాలయాలకు ధర్మకర్తల మండళ్లు
6

మన సంస్కృతిని ప్రతిబింబించే కళ చేనేత

» చేనేత దినోత్సవంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు
» కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్


పెద్దాపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రతిబిం బించే కళ చేనేత అని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) అన్నారు. పెద్దాపురం బాస్కరకాలనీలో ఉన్న ముప్పన రామారావు వీవర్స్ కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన చేనేత దినోత్సవం కార్యక్రమంలో ఆయన కలెక్టర్ షాన్మోహన్‌తో కలిసి గురువారం మాట్లాడారు. చేనేత కార్మికుల కృషిని గుర్తిస్తూ సంప్రదాయ హస్తకళలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రతి ఏడాది ఆగస్టు 7న చేనేత దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. చేనేత అంటే కేవలం వస్త్రతయారీ మాత్రమే కాదని, మన సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించే గొప్ప కళ అన్నారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ప్రజల్లో చేనేత వస్త్రాల పట్ల ఆసక్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. పెద్దాపురం సిల్క్‌కు ఇటీవల జాతీయస్థాయిలో గుర్తింపు లభించడం చాలా గొప్ప విషయమన్నారు. చేనేతరంగాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం చేనేత కార్మికులకు ఎన్నో సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. 50మంది చేనేత కార్మికులకు రూ.కోటి ముద్రా రుణాలకు సంబంధించి చెక్కును అందచేశారు. కార్యక్రమంలో చేనేత జౌళీశాఖ ఏడీ కె.పెద్దిరాజు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, చేనేత సహకార సంఘం సీఈవో తూతిక చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


చేనేత కార్మికుల కుటుంబాలకు చెక్కును అందచేస్తున్న తుమ్మల బాబు, కలెక్టర్ షాన్‌మోహన్

పట్టాదారు.. పాస్!



మళ్లీ మంచి రోజులు..



జగన్ బొమ్మతో జారీ చేసిన పాస్‌బుక్‌లను నిలిపివేసి ఆంధ్రప్రదేశ్ రాజముద్రతో కొత్త బుక్‌లను ప్రభుత్వం సిద్ధం చేసింది. వీటిని ఆగస్టు 15న రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పంపిణీ చేయబోతోంది. ఇప్పటికే ఇవన్నీ ఆయా జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు చేరుకున్నాయి. కాకినాడ జిల్లాకు మొత్తం 1.47 లక్షలు, కోనసీమ 1.02 లక్షలు, తూర్పుగోదావరి జిల్లాకు 95 వేల వరకు వచ్చాయి. వీటిని ఆయా మండలాలకు తరలించి రైతులకు పంపిణీ చేయనున్నారు. ఒక రకంగా చెప్పాలంటే అనేక ఏళ్ల తర్వాత మళ్లీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తళతళలాడే పాస్‌బుక్‌లు రైతులకు అందబోతున్నాయి. ఈ పాస్ బుక్‌లపై క్యూఆర్‌కోడ్‌తోపాటు ఆధార్ నెంబరు ఉంటుంది. దీని ఆధారంగా ప్రతి యజమాని తమ సొంత భూమి వివరాలు తెలుసు కునే వెసులు బాటును ప్రభుత్వం కల్పించింది. మరో పక్క పంపిణీ చేసిన పాస్ పుస్తకాల్లో తప్పులుంటే వెనక్కు తీసుకుని మళ్లీ కొత్తవి జారీ చేయనున్నారు. కొత్త పాస్‌బుక్‌లతో భూ యజమానుల సమస్యలు తీరనున్నాయి.

ఆగస్టు 15 నుంచి కొత్త పాస్‌బుక్‌లు

» ఉమ్మడి జిల్లాలో పంపిణీకి శ్రీకారం
» 3.44 లక్షల పాస్ పుస్తకాలు రాక
» గతంలో జగన్ బొమ్మతో జారీ
» రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత
» కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు
» మళ్లీ రాజముద్రతో పాస్‌బుక్‌లు
» నేడో రేపో రైతులకు అందజేత

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి రైతులకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీకి రంగం సిద్ధమవుతోంది. భూసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు కొత్త పాస్ పుస్తకాలను అధికారులు అందించనున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ బొమ్మతో రైతులకు పాస్ పుస్తకాలు అరకొరగా ఇవ్వడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో వీటి పంపిణీకి బ్రేక్ పడింది.ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మునుపటిలా ఆంధ్రప్రదేశ్ రాజ ముద్రతో కొత్త పాస్‌పుస్తకాల జారీకి రెవెన్యూ శాఖ నిర్ణయించింది. ఎట్టకేలకు ఇవన్నీ జిల్లాలకు చేరుకున్నాయి. ఆగస్టు 15న వీటిని రీసర్వే పూర్తి చేసుకున్న గ్రామాల్లో పంపిణీ చేయనున్నారు.

నేటికీ 1920 నాటి లెక్కలే..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేటు భూముల సర్వే 1920లో జరిగింది. దీని ప్రకారమే 2022 వరకు భూ లావాదేవీలు జరిగాయి.వాస్తవానికి 1920లో జరిగిన భూసర్వే 30 ఏళ్ల పాటు మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలి.ఆ తర్వాత మళ్లీ భూ రీసర్వే జరగాలి. కానీ అనేక కారణాలతో సర్వే జరగలేదు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు భూమి ఏదైనా సరే వివాదం తలెత్తితే 1920 నాటి రీ సర్వే రిజిస్టర్ (ఆర్ఎస్ఆర్) మాత్రమే రెవెన్యూ శాఖకు ప్రామాణికంగా మారింది. ఈ వందేళ్లలో అనేక మార్పులు వచ్చాయి. కానీ ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం వందేళ్ల కిందట స్థితిగతుల ప్రకారమే కొనసాగుతున్నాయి.మరో పక్క ఎక్కడైనా వందెకరాల భూమి ఉంటే దానికి ఏకమొత్తంగా ఒకే సర్వే నెంబర్ మాత్రమే కొనసాగుతోంది. ఈ సర్వే నెంబర్‌లో యాభై,అరవై మందికి భూమి ఉంటుంది. వీరు క్రయవిక్రయాలు జరిపితే ఒకే సర్వే నెంబరే అందరికీ ప్రామాణికంగా కొనసాగుతోంది. దీని వల్ల అనేక భూ వివాదాలు తలెత్తుతున్నాయి.

40 వేల మంది విజ్ఞప్తులు..

గత వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ అస్తవ్యస్తంగా మారింది. రైతుల భూములు కొనుగోలు చేసి ఏళ్లు దాటినా పాస్ బుక్‌లు అరకొరగా ఇచ్చారు. వాస్తవానికి ఇవి ఉంటేనే భూముల క్రయవిక్రయాలు సాగుతాయి. రైతులకు రుణాలు వస్తాయి.కానీ జగన్ సర్కారు అప్పట్లో ఇదేదీ పట్టించుకోలేదు. పాస్ పుస్తకాల కోసం తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరిగినా ఖాతరు చేయలేదు. అదే సమయంలో అప్పటి ప్రభుత్వం కొత్తగా 2022 సమగ్ర భూ సర్వే చేపట్టి అరాచకం సృష్టించింది. దీనిపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విసిగెత్తిపోయిన 40 వేల మందికిపైగా బాధితులు న్యాయం చేయాలంటూ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందించారు. వీటిపై ప్రభుత్వం దృష్టి సారించి గ్రామాల వారీగా బాధితుల సమస్యలు వింటూ తిరిగి రీసర్వే చేపట్టింది. రీసర్వేలో సంబంధిత భూయజమానులకు ముందే సమాచారం ఇచ్చి సర్వే చేపట్టారు.ఇలా ఉమ్మడి జిల్లాలో 600 గ్రామాల్లో సమస్యలు చాలా వరకు పరిష్కరించారు.

600 గ్రామాల్లో అస్తవ్యస్తం..

గత వైసీపీ ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేయ డానికి కసరత్తు జరిపింది. ఒక్కో సర్వే నెంబర్‌లో ఎంత మందికి భూములున్నాయనేది గుర్తించి ఆ సర్వే నెంబర్‌లో ఉన్న వారందరికి కొత్తగా సబ్‌డివిజన్ చేసి ప్రతి ఒక్కరికి ఉమ్మడిగా ఇంత కాలంగా ఉన్న సర్వే నెంబర్ స్థానంలో సబ్‌డివిజన్ సర్వే నెంబర్ కొత్తగా కేటాయించాలని నిర్ణయించింది. కానీ ఆచరణలో అప్పటి ప్రభుత్వం విఫలమైంది. సర్వేను వేగంగా పూర్తి చేయాలని ఒత్తిళ్లు తేవడంతో ఈ ప్రక్రియను రెవెన్యూ,సర్వేశాఖ అధికారులు అస్తవ్యస్తంగా మార్చేశారు.ఉమ్మడి జిల్లాలో ఆరు వందలకుపైగా గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. కాకినాడ జిల్లా 15 మండలాల పరిధిలో 269 గ్రామాలు, తూర్పుగోదావరి జిల్లా 19 మండలాల్లోని 190 గ్రామాలు, కోనసీమ జిల్లాలో 150కి పైగా గ్రామాల్లో సర్వే చేశారు. భూయజమానులు లేకపోయినా పక్క స్థలాల యజమానులను అడిగి రీ సర్వే కానిచ్చేశారు. దీంతో వేలాది మంది భూముల విస్తీర్ణం చాలా వరకు తగ్గిపోయింది. మరి కొందరి విస్తీర్ణం అమాంతం పెరిగిపోయింది. రీసర్వే తప్పులతో భూయజమానుల పేర్లు సైతం మారిపోయాయి. వీటిని సరిచేయాలని వేలాదిగా బాధితులు కాళ్లరిగేలా తిరిగినా ప్రభుత్వం పరిష్కరించలేదు. సర్వే పూర్తయిన గ్రామాల్లో సొంత ప్రచారం కోసం జగన్ బొమ్మతో పాస్‌బుక్‌ల జారీకి అధికారులు ప్రయత్నించారు. ఇది తీవ్ర విమర్శలపాలైంది.





మార్కెట్లకు..

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సర్పవరం పూల మార్కెట్ వద్ద పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

వరలక్ష్మీవ్రత శోభ

» వ్రతరూపులు, పూజాసామాగ్రి కొనుగోలుదారులతో కిటకిట
» భక్తజన సంద్రమైన రహదారులు

కాకినాడ/పిఠాపురం,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మహిళలు అత్యంత పవిత్రంగా భావించి భక్తి, శ్రద్ధలతో పూజలు నిర్వహించే శ్రావణమాసంలోని వరలక్ష్మి వ్రతానికి విశేష ప్రాధాన్యం ఉంది. ఈపూజలకోసం అవసరమైనరూపులు, నూతన వస్త్రాలు, పండ్లు, పుష్పాలు, పూజా సామాగ్రి కొనుగోలుకు ప్రజలంతా తరలిరావడంతో మార్కెట్లు జనసంద్రంగా మారాయి. దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి.

కాకినాడ జిల్లాలోని మార్కెట్లకు గురువారం వరలక్ష్మి వ్రతశోభ చేకూరింది. వరలక్ష్మి వ్రతం, శ్రావణ శుక్రవారం నోము ఆచరించే మహిళలతోపాటు శుక్రవారం ప్రజలుభారీగా తరలిరావడంతో రహదారులన్నీ జనసమర్థంగా మారాయి. కాకినాడనగరంలోని పెద్దమార్కెట్, గాంధీనగర్ రైతు మార్కెట్, ఆర్టీసీ కాంపెక్స్‌వద్ద రైతుమార్కెట్, సర్పవరం పూలమార్కెట్లు గురువారం జనంతో కిటకిటలాడాయి. కాకినాడ నగరంతోపాటు పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, పెద్దాపురం, తుని, ఏలేశ్వరం పట్టణాలతోపాటు జగ్గంపేట, కరప, ప్రత్తిపాడు, తాళ్లరేవు, కాజులూరు, పెదపూడి, జి.మామిడాడ, కొత్తపల్లి, ఉప్పాడ తదితర ప్రాంతాల్లోని మార్కెట్లకు ప్రజలు పోటెత్తారు. పండ్లు, పూలు, ఇతర వస్తువులను కొనుగోలు చేశారు. వరలక్ష్మి వ్రతానికి సంబంధించి పూజా సామాగ్రి, పండ్లు, పువ్వులు, అమ్మవార్ల ఫొటోలు, ఇతర సామాన్లు విక్రయించేందుకు ఎక్కడికక్కడ ప్రత్యేక దుకా ణాలు వెలిశాయి. కొత్త చీరలు, జాకెట్లు కొనుగోలుకు వస్త్రదుకాణాలకు తరలివచ్చారు.

అమ్మో బంగారం రూపే..

వ్రతంలో బంగారం లేదా వెండి లేదా రాగితో చేసిన వరలక్ష్మి రూపు ఉంచి పూజ చేస్తే మంచి జరుగుతుందన్నది నమ్మకం. ప్రతిఏటా మహిళలు రూపుల కొనుగోలుకు భారీగా తరలివస్తారు. దీంతో బంగారు దుకాణాలు కిటకిటలాడుతూ కనిపిస్తాయి. గతంతో పోల్చుకుంటే ఈసారి రద్దీ కొంతమేర తక్కువగా కనిపించింది. బంగారం 10గ్రాముల ధర లక్ష రూపాయిలు దాటడంతో రూపుకొనే వారు ఆలోచించాల్సిన పరిస్థితి కనిపించింది. గతంలో రూ.500కే బంగారు వరలక్ష్మి రూపు వచ్చేది. ఈ ఏడాది కనీస ధర రూ.1800నుంచి రూ.2000 వరకూ ఉంది. ఇంత సొమ్ము పెట్టి కొనలేని వారు వెండి రూపులు కొనుగోలుకు మొగ్గుచూపారు.

మండిన ధరలు

పూజా సామాగ్రి ధరలకు రెక్కలొచాయి. పూల ధరలు రుసరుసలాడితే.. పండ్ల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉన్నాయి. యాపిల్, బత్తాలు అయితే కొనలేని పరిస్థితి. యాపిల్ పండ్లు ఓ మాదిరి సైజు రెండు కాయలు రూ.100కు విక్రయించారంటే ధరలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. చామంతి, గులాబీ, ఇతర పూలు కూడా పువ్వు రూ.పదికిపైగా విక్రయించారు. కొబ్బరికాయ ధర రూ.40, మామిడాకుల పత్రి ధర పెంచేశారు.


కాకినాడలో శ్రావణ శుక్రవారం పూజాసామాగ్రి తీసుకెళ్తున్న దృశ్యం

అర్జీలను దాతృత్వంతో పరిష్కరించాలి

» సీఎంవో కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్య గ్రీవెన్స్ అధికారి
» జిల్లానుంచి హాజరైన అధికారులు


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, ఇతర అధికారులు

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలనుంచి అందిన అర్జీలను దాతృత్వంతో పరిష్కరించాలని సీఎంవో ముఖ్య గ్రీవెన్స్ అధికారి చిన్నారావు సూచించారు.

గురువారం వెలగపూడి సీఎంవో కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై ఆయన సమీక్షించారు. కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి వాసుదేవరావు హాజరయ్యారు. ఈసందర్భంగా సీఎంవో ముఖ్య గ్రీవెన్స్ అధికారి చిన్నారావు మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ప్రజలనుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అధికారి వద్దకు సామాన్యులు వచ్చినప్పుడు స్వేచ్ఛగా సమస్య చెప్పుకుని పరిష్కారమయ్యేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో బాగా పనిచేసిన అధికారులను గౌరవించడం జరుగుతుందన్నారు. పనిచేయని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చిన దరఖాస్తులను ఏ విధంగా పరిష్కరించాలో వాటిని వివరించారు. అర్జీదారులతో గౌరవంగా, సానుకూల దృక్పథంతో మాట్లాడాలన్నారు. పరిష్క రించిన అర్జీలను జిల్లాస్థాయిలో నియమించిన నోడల్ అధికారి ఆడిట్ చేస్తారన్నారు. దాన్ని మరోసారి సీఎంవో కార్యాలయంలో ఆడిట్ జరుగుతుందన్నారు. సమస్యలను సక్రమంగా పరిష్కరించకపోతే అధికారులకు మెమో జారీ చేస్తామన్నారు. అర్జీలను నిర్థిష్టకాల పరిమితి లోపు నాణ్యమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలన్నారు. అర్జీలు పరిష్కరించే సమయంలో ప్రొసీజర్స్ లాప్స్, బిహేవియర్ లాప్స్ లేకుండా అధికారులు పరిష్కరించాలన్నారు. మే, జూన్, జూలై నెలలకు సంబంధించి వచ్చిన అర్జీలను ఎన్ని సక్రమంగా పరిష్కరించారు, ఎన్ని పరిష్కరించలేదు వంటి వివరాలను శాఖల వారీగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గిరిజన తండాకెళ్లారు.. సమస్యలు విన్నారు!

కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ వినూత్న ప్రయోగం


వానొచ్చినా తండాకు నడచి వెళుతున్న కలెక్టర్

ప్రత్తిపాడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉలిగోగుల గిరిజన ప్రాంత అభివృద్ధి, ప్రజల అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తానని కలెక్టర్ షాన్ మోహన్ షగిలి తెలిపారు.ప్రత్తిపాడుకు 20కిలోమీటర్ల పైబడి ఎత్తయిన కొండలపై ఉన్న బురదకోట పంచాయతీ పరిధిలోని ఉలిగోగుల గిరిజన తండాను గురువారం రెవెన్యూ, మండలాభివృద్ధి, వైద్యం, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. గిరిజనులతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రహదారులు, పక్కా గృహాలు, అంగన్‌వాడీ కేంద్రం, వీధి దీపాలు, మంచినీరు, ఇంటింటికి కుళాయిలు, యాని మేటర్ ఏర్పాటు వంటి సమస్యలు గిరిజనులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గతంలో పనిచేసిన ఏఎన్ఎంను తిరిగి ఇక్కడ నియమించాలని, కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని, తమ గిరిజనగూడెంను గోకవరం పంచాయతీలో కలపాలని, సిమెంట్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, మెట్టుచింత నుంచి ఉలిగోగుల వరకు రహదారి నిర్మించాలని విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ 3.5 కిలోమీటర్ల రహదారికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. హౌసింగ్‌కు సంబంధించి గ్రామ కంఠం లేని కారణంగా ఇళ్లు నిర్మించుకునే అవకాశం లేదని, ఉపాధి హామీ బిల్లులు రావాల్సి ఉందని గిరిజనులు కలెక్టర్‌కు తెలిపారు. వీటిపై మండల స్థాయి అధికారులతో అక్కడికక్కడే చర్చించి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు తగ్గిన తరువాత ఉలిగోగులకు తారు రోడ్డు వేస్తామని కలెక్టర్ గిరిజనులకు తెలిపారు. బదిలీపై వెళ్లిన ఏఎన్ఎంను ఇక్కడ నియమించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. గిరిజనులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను మూడు వారాల్లో పరిష్కరిస్తామన్నారు. అనంతరం గిరిజన ప్రాథమిక పాఠశాలలో 10 మంది విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వర్షంలోను కలెక్టర్ ఉలిగోగుల కొండపై పర్యటించారు. వర్షం కురవడంతో కొండపై చిత్తడి.. చిత్తడి వాతావరణం నెలకొన్నా గొడుగు సహాయంతో కలెక్టర్ కలియతిరిగారు. ఆయన వెంట తహశీల్దార్ సూర్యప్రభ, ఎంపీడీవో కుమార్ బాబు, ఎంఈవో వి.రాజబాబు, వై.అచ్చిరాజు, వైద్యాధికారి యశస్వి, ఇంజనీరింగ్ అధికారి సత్యప్రకాష్, సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం తదితరులు ఉన్నారు.


గిరిజన తండాలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

విచారణ చేపడతాం

» 'ఆత్మలకు రేషన్..' కథనానికి స్పందించిన జేసీ రాహుల్
» ప్రత్యేక బృందంతో విచారణ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

చనిపోయిన రేషన్‌కార్డుదారుల పేరుతో నిత్యావసర సరుకులు దోచేస్తున్నారని, జిల్లాలోని కొందరు రేషన్‌డీలర్లు ఈ వ్యవహారాన్ని చక్కబెడుతున్నారని అంత్యోదయ కార్డుదారుల నెంబర్లు, మరణధ్రువీకరణ పత్రాలతో 'ఆత్మలకు రేషన్.. డీలర్లు పరేషాన్' పేరుతో గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జేసీ రాహుల్ మీనా, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ అధికారులు స్పందించారు. ఈ మొత్తం దోపిడీ వ్యవహారంపై విచారణ ప్రారంభించారు. ఇందులో ఎవరెవరి పాత్రలున్నాయో ఆరా తీస్తున్నారు. ఇలాంటి అవినీతి, అక్రమాలు జరగాలంటే డీలర్‌వల్ల సాధ్యం కాదని, ఇందులో ఎంఎస్‌వోలు, వీఆర్‌వోలు, సివిల్ సప్లయిస్ కార్యాలయ సిబ్బంది ప్రమేయం ఉంటుందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. జిల్లాలో ఎవరైనా మరణించి ఉంటే వారి కుటుంబసభ్యులు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను కార్డులనుంచి తొలగిస్తామని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. ఆంధ్రజ్యోతి కథనం రేషన్ అక్రమదారుల గుండెల్లో రైళ్లు పరిగెట్టించింది. ఆత్మలకు రేషన్ కథనంపై కాకినాడ రూరల్, సిటీ నియోజవర్గాల్లో తీవ్ర చర్చసాగింది.

జగ్గంపేటలో 25.8 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

జగ్గంపేట రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో 25.8 టన్నుల అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డీఎస్‌పీ సత్యనారాయణకు అందిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. జగ్గంపేట ఎన్‌హెచ్ 16 జాతీయరహదారి జేవియర్ కాంప్లెక్స్‌వద్ద ఒక వాహనం, గుర్రప్పాలెం రోడ్డులోని రైస్ మిల్లు సమీపంలో మరో రెండువాహనాలను పట్టుకున్నట్లు డీఎస్‌పీ సత్యనారాయణ తెలిపారు. వీటి విలువ రూ.12లక్షలు ఉంటుందని వివరించారు. రేషన్‌బియ్యాన్ని రంగు సంచుల్లో నింపి తరలిస్తున్నట్లు వివరించారు. మూడు వాహనాల్లోని రేషన్‌బియ్యాన్ని తూకం వేయగా 25.8 టన్నులు వచ్చినట్లు తెలిపారు. ఈ బియ్యాన్ని మర్రిపాక రోడ్డులోని సివిల్ సప్లై గొడౌన్‌కి తరలించినట్లు వివరించారు. ఏపీ39వీపీ4199లో 1700కిలోలు, ఏ02టీఎప్0540లో 5000కిలోలు, ఏ39టీహెచ్7114లో 3800కిలోలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్‌ఓ తెలిపారు. జిల్లాలో రేషన్ బియ్యంపై నిరంతరం నిఘా పెట్టినట్లు తెలిపారు. వాహనాలను సీజ్ చేసి టేకి వీరబాబు,నల్లంశెట్టి లక్ష్మీనారాయణ, ఊట మణికంఠలను అదుపులో తీసుకున్నట్లు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. సివిల్ సప్లై అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ఎస్పీకి రక్షాబంధన్

(ఆంధ్రజ్యోతి-కాకినాడ)

రక్షాబంధన్ ముందుగానే వచ్చింది. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ వాస్తవానికి శనివారం. కానీ, కాకినాడలోని ఓం శాంతి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌కు ఓ బ్రహ్మకుమారీ ముందుగానే గురువారం ఇలా రాఖీ కట్టారు.

సత్యగిరిపై కారు దగ్ధం


అన్నవరం సత్యగిరి కొండపై హరిహర సదన్ వద్ద దగ్ధమవుతున్న కారు

అన్నవరం,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం సత్యగిరి కొండపై ఓ కారు రాత్రి 11గంటల సమయంలో దగ్ధమైంది. ఒక వివాహం నిమిత్తం పెండ్లి బృందం ఈ కారులో విచ్చేయగా హరిహర సదన్ పక్కన పార్కింగ్ చేశారు. కారులోంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అదృష్టవశాత్తూ ఎవరూ కారులో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కారు పూర్తిగా దగ్ధమైంది. తుని నుంచి ఫైర్‌ఇంజిన్ వచ్చి మంటలు అదుపు చేసింది.



పిఠాపురం పాదగయ క్షేత్రం

ఇక ఆలయాలకు.. ట్రస్టు బోర్డులు

పిఠాపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత నామినేషన్ల పదవుల భర్తీ కొనసాగుతోంది. ఎప్పటినుంచే ఎదురుచూస్తున్న ప్రముఖ ఆలయాలకు ట్రస్టుబోర్డుల నియామకం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ల జారీకి జీవో విడుదల చేసింది. ఆయా ఆలయాలకు నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి 20 రోజుల్లోగా వీటికోసం ఆశావాహులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

రెండునెలల కసరత్తు తర్వాత..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్పొరేషన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సొసైటీలకు పాలకవర్గాలు నియమించినా ఆలయాలకు ట్రస్టుబోర్డుల నియమాకం కోసం నియోజకవర్గాల్లో కూటమి పార్టీల నాయకులు ఎదురుచూపులు చూడాల్సి వచ్చింది. ఇప్పటికే చిన్న ఆలయాల ట్రస్టుబోర్డులు నియమించేందుకు ఎక్కడికక్కడ నోటిఫికేషన్లు జారీ చేసి దరఖాస్తులు స్వీకరించి విచారణ పక్రియ పూర్తి చేసినా ఇప్పటివరకూ ధర్మకర్తల మండళ్లను ఏర్పాటు చేస్తూ తుది ఉత్తర్వులు విడుదల కాలేదు. రూ.కోటి నుంచి రూ.5కోట్లు వరకూ ఆదాయం ఉన్న ప్రముఖ ఆలయాలకు ట్రస్టుబోర్డుల ఏర్పాటుపై రెండు నెలల కసరత్తు అనంతరం దరఖాస్తుల స్వీకరణకు నోటిఫికేషన్ విడుదల చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

20రోజులు గడువు

ట్రస్టుబోర్డుల ఏర్పాటు నిమిత్తం రాష్ట్రప్రభుత్వం గురువారం జీవో జారీ చేయగా 20 రోజుల్లోగా ఆయా ఆలయాల ధర్మకర్తల మండలి సభ్య పదవులు(ట్రస్టీలు) కోసం ఆశావాహులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందు నిమిత్తం దరఖాస్తు ఫారం ప్రొఫార్మాను జీవోకు జత చేశారు. ఈ దరఖాస్తులను ఆయా ఆలయ ఈవోలకు అందజేయాల్సి ఉంటుంది. వీటిపై విచారణ తర్వాత ట్రస్టుబోర్డులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తుంది. ట్రస్టీల ప్రమాణస్వీకారం అనంతరం ఆయా ఆలయాల ధర్మకర్తల మండలి చైర్మన్లను ఎన్నుకోనున్నారు. జీవో జారీ కావడంతో ఆశావహుల్లో సందడి మొదలైంది. ఆలయాలు ఉన్న నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య ఇప్పటికే పదవుల పంపకంపై చర్చలు కొలిక్కి వచ్చాయి. ఆయా పార్టీలకు కేటాయించిన పదవుల ఆధారంగా దరఖాస్తు చేసుకోనున్నారు.

అన్నవరం కోసం ఎదురుచూపులే

రాష్ట్రవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానానికి మాత్రం ఇప్పటివరకూ ట్రస్టుబోర్డు ఏర్పాటు కాలేదు. ఇక్కడ వంశపారంపర్య చైర్మన్ ఉండడంతో ట్రస్టుబోర్డుల సభ్యుల నియామకానికే నోటిఫికేషన్ జారీ కావాల్సి ఉంది. ఈ పదవుల కోసం కాకినాడ జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పలువురు పోటీపడుతూ ఉంటారు. ఇప్పటికే పదవుల కేటయింపుపై కూటమి పార్టీల మధ్య రాష్ట్ర స్థాయిలో చర్చలు జరిగాయి.

చిన్నఆలయాలకు, సత్రాలకు కూడా..

కాకినాడ జిల్లాలోని మరో 8ఆలయాలు, దేవదాయశాఖ అధీనంలోని సత్రాలకు ధర్మకర్తల మండళ్ల ఏర్పాటు నిమిత్తం ఏపీ ధార్మిక పరిషత్ సభ్య కార్యదర్శి హోదాలో దేవదాయశాఖ కమిషనరు కె.రామచంద్రమోహన్ గురువారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేశారు. పిఠాపురంలోని శ్రీసంస్థానసత్రం, కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని భవన్నారాయణస్వామిఆలయం,

- దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ
- ఉమ్మడి జిల్లాలో 16 దేవాలయాలకు ధర్మకర్తల మండళ్లు

పెద్దాపురంలోని ఆర్వీబీఎస్ సత్రం, మండలంలోని కాండ్రకోటలోని నూకాలమ్మ దేవస్థానం, జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలోని పీఎల్వీ సత్రం, కాకినాడలోని కోకనాడ అన్నదాన సమాజం, బంగారు చినశోభనాద్రి సత్రం, మంత్రి పగ్రడ వారి సత్రాలకు ధర్మకర్తల మండళ్ల ఏర్పాటు కానున్నాయి.

ఆలయాలు ఇవే

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 16 ఆలయాల ట్రస్టు బోర్డుల ఏర్పాటుకు జీవో జారీ కాగా ఇందులో కాకినాడ జిల్లాకు సంబంధించి ఏడు, కోనసీమ ఆరు, తూర్పుగోదావరి జిల్లాలోని మూడు ఆలయాలున్నాయి.

- కాకినాడ జిల్లాకు సంబంధించి పిఠాపురంలోని పాదగయక్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం, శ్రీపాదులవారి జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం, పంచారామక్షేత్రాల్లో ఒకటిగా ఉన్న సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి దేవస్థానం, చదలవాడ తిరుపతిలోని శృంగార వల్లభస్వామి ఆలయం, పెద్దాపురం మరిడమ్మ దేవస్థానం, తుని తలుపులమ్మలోవ, కాకినాడ ఎంఎస్ఎన్ చార్టీస్‌లకు ట్రస్టుబోర్డులు ఏర్పాటు కానున్నాయి.
- కోనసీమ జిల్లాలోని వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయం, అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం, అమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం, మురముళ్లలోని వీరేశ్వరస్వామి దేవస్థానం, మందపల్లి మందేశ్వరస్వామి ఆలయాలకు ట్రస్టుబోర్డులు ఏర్పాటు చేస్తారు.
- తూర్పుగోదావరిజిల్లాలోని రాజమహేంద్రవరంలోని పీఎంకే చౌల్ట్రీ, నాళంవారి సత్రం, నిడదవోలు కోట సత్తెమ్మవారి ఆలయానికి ట్రస్టుబోర్డులు ఏర్పాటు కానున్నాయి.



వాడపల్లి వెంకన్న ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ

ఆత్రేయపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియమాకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రేడ్-1 స్థాయిలో ఉన్న ఈ ఆలయం డీసీ హోదాకు చేరుకుంది. వార్షిక ఆదాయం రూ.30 కోట్లనుంచి రూ.35కోట్లుపైనే ఉంటుంది. డిప్యూటీ కమిషనరు హోదా కలిగిన ఈ ఆలయానికి కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వి.వినయ్‌చంద్ గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 17మంది ధర్మకర్తలను నియమించాల్సి ఉంది. మరో అర్చక ఎక్స్‌ఆఫీసియో నియమించనున్నారు. 17మందిలో ఏడుగురు మహిళలకు ధర్మకర్తల మండలిలో చోటు కల్పించాల్సి ఉంది. అందులో నాయీబ్రాహ్మణ, బ్రాహ్మణ కులాలకు చెందిన వ్యక్తులకు విధిగా చోటు కల్పించాలి. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలకు ట్రస్టు బోర్డు నియామకం చేపట్టనున్నారు. దేవదాయ కమిషనరు రామచంద్రమోహన్ నుంచి రావాల్సిన ఉత్తర్వుల మేరకు నోటిఫికేషన్ విడుదల చేసి ధర్మకర్తల మండలి నియామకం కోసం ఉత్తర్వులు అందజేయనున్నారు. 20రోజుల్లోగా

- 17మంది ధర్మకర్తల నియామకం కోసం దరఖాస్తుల స్వీకరణ

అర్హులైన దరఖాస్తులు పరిశీలించి కమిషనర్ కార్యాలయానికి పంపించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించిన వ్యక్తులకు ధర్మకర్తల మండలిలో స్థానం లభించనుంది. జిల్లావ్యాప్తంగా ధర్మకర్తల మండలిలో చోటు కోసం కూటమి పార్టీల నేతలు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. స్థానిక నేత, క్షత్రియ వర్గానికి చెందిన నేతకు చైర్మన్ గిరి దక్కనుంది.

స్కానర్ ఉందిగా..



కాకినాడలో స్కానర్‌లో డిజిటల్ పేమెంట్ చేస్తున్న యువకుడు

- క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ పేమెంట్లు
- చిన్న దుకాణాల్లోను పెరిగిన నగదు రహిత లావాదేవీలు
- ప్రజల్లో పెరిగిన అవగాహన

టీ తాగినా.. టిఫిన్ తిన్నా.. టూత్‌పేస్ట్ కొన్నా.. టీపొడి కొన్నా.. షాపింగ్ మాల్‌కి వెళ్లినా.. చిన్న బడ్డీ కొట్టైనా.. ఎక్కడికి వెళ్లినా ఈ మధ్య కాలంలో వినిపించే పదం.. స్కానర్ ఉందా..? స్కాన్ చేసేయన్నా.. ఒకప్పుడు నగదు లావాదేవీలు మాత్రమే జరిగేవి. కానీ కేంద్ర ప్రభుత్వ చొరవతో డిజిటల్ పేమెంట్స్ పెరిగాయి.

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లోనే కాక గ్రామాల్లోను డిజిటల్ పేమెంట్లు పెరిగాయి. ఆరేళ్లక్రితం పెద్దనోట్లను రద్దు చేసిన కేంద్రం ప్రభుత్వం ఆర్థిక సంస్కరణల్లో భాగంగా నగదు రహిత లావాదేవీల మీద దృష్టి సారించింది. దీంతో బ్యాంకర్లు గ్రామస్థాయి నుంచి క్షేత్రస్థాయిలో నగదు రహిత లావాదేవీల మీద ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రారంభదశలో ప్రజలు లావాదేవీలు చేసుకునేందుకు ఇబ్బందులు పడినప్పటికీ ప్రస్తుతం పూర్తిస్థాయిలో నగదు రహిత లావాదేవీలకు అలవాటుపడ్డారు. దుకాణానికి వెళ్లినా, పెట్రోల్‌బంక్‌కు వెళ్లినా క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉండడంతో వినియోగదారుల చేతిలో డబ్బులు లేకపోయినా స్మార్ట్ ఫోన్‌తో ఆర్థిక లావాదేవీలు జరుపుతున్నారు.

క్యూఆర్ కోడ్‌తో..

ఒకప్పుడు అందరూ ఎక్కడికి వెళ్లిన సరిపడా డబ్బులు తీసుకెళ్లేవారు. ఆర్టీసీ, రైల్వే ప్రయాణంలో చిల్లర సమస్య మరీ ఎక్కువగా ఉండేది. ఇంకా అవసరమైతే బ్యాంక్, ఏటీఎం సెంటర్‌లో నగదువిత్ డ్రా చేసుకుని వినియోగించుకునేవారు. ప్రస్తుతం ఆపరిస్థితి కనిపించడంలేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా స్మార్ట్ ఫోన్లు, నగదు బదిలీల కోసం మొబైల్ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. నగదురహిత లావాదేవీల కోసం క్యూఆర్ కోడ్ మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. దీంతో చిన్నపాటి తోపుడు బండ్లవద్ద నుంచి పెద్ద వ్యాపారస్తులు, కార్పొరేట్ ఆస్పత్రులు, ఆర్టీసీ బస్సుల్లో, రైల్వేస్టేషన్‌ల్లో ఈ క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉండడంతో రోజుకు ఒక్కరూపాయి మొదలు లక్షల వరకు యాప్‌ల ద్వారా నగదు రహిత ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

వివిధ యాప్‌లు..

ఆన్‌లైన్ ద్వారా నగదు రహిత లావాదేవీలు చేసేందుకు స్మార్ట్ ఫోన్‌ల్లో వివిధ రకాల యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, డిజిటల్ రూపే, అమెజాన్‌పే, వాట్సప్‌పే లాంటి యాప్‌లతోపాటు బిల్ డెస్క్ వంటివాటలోను డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. యాప్ కంపెనీ నిర్వాహకులు, వ్యాపారుల సౌకర్యార్థం దుకాణదారులకు సౌండ్ బాక్సులు కూడా ఇస్తున్నారు. రోజువారీ లావాదేవీలను బట్టి రుణాలు కూడా మంజూరు చేస్తుండడంతో వ్యాపారులు క్యూఆర్ కోడ్‌ల మీద ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో వ్యాపారులకు చిల్లర గొడవ తప్పింది.

చిల్లర ఇబ్బందులు తప్పాయి

-వారణాసి శ్రీనివాసరావు, కాకినాడ



గతంలో కిరాణాదుకాణానికి పెద్దనోటు తీసుకు వెళ్తే చిల్లరకోసం చాలా ఇబ్బందులు పడేవాళ్లం. అవసరం లేకపోయినా వేరే సరుకులను కొనుగోలు చేయాల్సి వచ్చేది. స్మార్ట్ ఫోన్ల ద్వారా చెల్లింపులతో చిల్లర కష్టాలు తగ్గాయి.

అవగాహన కల్పిస్తున్నాం

-రాజాబాబు, కిరాణాషాపు యజమాని



షాపులకు వచ్చేవారందరూ ఏది కొన్నా స్మార్ట్ ఫోన్ల ద్వారా చెల్లిస్తున్నారు. డిజిటల్ పేమెంట్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మాకు చిల్లర కష్టాలు తగ్గాయి. క్యూఆర్ కోడ్ గురించి తెలియని వారికి తెలియజేస్తున్నాం.



జ్యోతిప్రజ్వలన చేసి గిరిజన దినోత్సవాన్ని ప్రారంభించిన ఉప కులపతి ప్రసన్నశ్రీ

గిరిజన సంస్కృతిని సాంకేతికతతో పరిరక్షించుకుందాం

అంతర్జాతీయ గిరిజన దినోత్సవంలో 'నన్నయ' ఉప కులపతి ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మౌఖిక రూపంలో ఉండే అపారమైన గిరిజన సాహిత్య, సంస్కృతి సంపదను సాంకేతిక పరిజ్ఞానంతో పరిరక్షించి భావితరాలకు అందించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పిలుపునిచ్చారు. నన్నయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం సహకారంతో ఎస్సీ, ఎస్టీ సెల్, విశ్వవిద్యాలయం సైన్స్-టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ గిరిజన దినోత్సవం-2025ను గురువారంనిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ స్థానిక ప్రజలు, కృత్రిమ మేథస్సు-హక్కులను కాపాడుకోవడం, భవిష్యత్తును రూపొందించడం అనే అంశంతో ప్రపంచ గిరిజన దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని భాష, సంస్కృతి, సాహిత్యం ఎంతో ప్రత్యేకమైనవని తెలిపారు. చిన్న, చిన్న గూడేల్లో స్వచ్ఛమైన గిరిజన సాహిత్యం తారసపడుతుందన్నారు. గిరిజనులు వాడుక భాషతో మౌఖికంగా సాహిత్య సేద్యం చేస్తున్నారన్నారు. ప్రకృతితో బంధం ఏర్పరచుకుని రాయిలో కూడా దేవుని చూడగలిగే మంచి మనసున్న వారే గిరిజన పుత్రులు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన ప్రాంతాల్లో రహదారులు వేయడం అభినందనీయమన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులే అసలైన దేవాలయాలని చెప్పారు. ఐక్యరాజ్యసమితి ప్రకారం అంతరించిపోతున్న భాషలు మౌఖిక చరిత్రలనుసంరక్షించడానికి, పూర్వీకుల భూములను మ్యాప్ చేయడం వంటివాటికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడుతుందన్నారు. ఆంధ్ర గిరిజన వర్గాలు భావితరాలకు సజీవవారసత్వ సంపద అని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి మాట్లాడుతూ నేటి ఆధునిక మానవుల ఆదిమ జీవితం ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లోనే ఆరంభమైందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని వివిధ రకాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రస్తావించారు. భారత స్వాతంత్రోద్యమంలో గిరిజనవీరుల కృషి చిరస్మరణీయమన్నారు. గిరిజన సంస్కృతిని ప్రతిబింబిస్తూ కూచిపూడి డిప్లొమా విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. విశ్వవిద్యాలయ అధికారులు వారితో కలిసి నృత్యం చేశారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, సదస్సు కన్వీనర్ పి.విజయనిర్మల, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన



కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య హోరాహోరీగా సాగుతున్న మ్యాచ్



తలపడుతున్న ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర జట్ల క్రీడాకారులు

రెండు డ్రా రెండు వన్‌సైడ్

జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీల్లో ముగిసిన లీగ్ మ్యాచ్‌లు

రేపటి నుంచి క్వార్టర్ ఫైనల్స్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హాకీ ఇండియా 15వ జూనియర్ మహిళా జాతీయ చాంపియన్‌షిప్-2025లో భాగంగా కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ ఫీల్డ్‌లో గురువారం నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. రెండు మ్యాచ్‌లు డ్రాగా ముగియగా, మరో రెండు మ్యాచ్‌లు వన్‌సైడ్ అయ్యాయి. ముఖ్య అతిథిగా మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ ఎం.సుభాకరరావు హాజరయ్యారు. రాష్ట్ర హాకీ సంఘ కార్యదర్శి హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు, కోశాధికారి పి.థామస్‌పీటర్, భవానీ శంకర్ ముఖ్య అతిథులుగా హాజరై మ్యాచ్‌లను వీక్షించారు.

పంజాబ్-చండీఘర్ మధ్య జరిగిన మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది. బెంగాల్-ఉత్తరప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్ 1-1తో డ్రా అయ్యింది. కర్ణాటక-ఛత్తీస్‌గఢ్ మధ్య జరిగిన మ్యాచ్ 6-1తో ఛత్తీస్‌గఢ్ విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్-మహారాష్ట్ర మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర 5-1తో విజయం సాధించింది.

మొత్తం 29 రాష్ట్రాల నుంచి జట్లు పాల్గొనగా గురువారంతో లీగ్ మ్యాచ్‌లు ముగిశాయి. క్రీడాకారులకు శుక్రవారం విశ్రాంతి ఇచ్చారు. చివరికి మిగిలిన ఎనిమిది జట్లు శనివారం జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడనున్నాయి.

క్వార్టర్ ఫైనల్ 1.హర్యానా వర్సెస్ ఒడిసా, 2.మధ్యప్రదేశ్ వర్సెస్ ఛత్తీస్‌గఢ్, 3.జార్ఖండ్ వర్సెస్ పంజాబ్, 4.మహారాష్ట్ర వర్సెస్ ఉత్తరప్రదేశ్

10న సెమీ ఫైనల్స్, 12న ఫైనల్స్

క్వార్టర్ ఫైనల్స్ ఆడిన 8 జట్లలో మిగిలిన నాలుగు జట్లు 10న సెమీ ఫైనల్స్ ఆడనున్నాయి. 11న విశ్రాంతి దినం. మూడో స్థానం కోసం 12వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు లూజర్ సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. మిగిలిన రెండు జట్లు సాయంత్రం 3 గంటలకు ఫైనల్ మ్యాచ్‌లో తలపడతాయని డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, రాష్ట్ర హాకీ సంఘ సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు చెప్పారు.



డబ్బులు లేవంటూనే లక్షల ఎకరాల భూసేకరణ

- మోదీ, చంద్రబాబు దొందూ దొందే
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి భూసేకరణ ప్రధాన అజెండాగా మారిపోయిందని, డబ్బులు లేవంటూనే లక్షల ఎకరాల భూసేకరణ చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ వ్యాఖ్యానించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే భూమిలేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్ల భూమి ఇస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా ఆ ఊసే ఎత్తట్లేదన్నారు. ఇళ్ల స్థలాల కోసం సీపీఐ కార్యకర్తలు కొన్ని ప్రాంతాల్లో పేదలతో దరఖాస్తులు చేయిస్తుంటే అధికార పార్టీ వారే చేయాలని అడ్డుకుని వారికి నచ్చివారితోనే దరఖాస్తు చేయించే పరిస్థితి వుందన్నారు. మరో పక్క రాష్ట్రంలో ప్రాంతీయ వైషమ్యాలు రెచ్చగొట్టడానికి ఉత్తరాంధ్రలో పరిశ్రమలు పెడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో దళితులు, మైనార్టీలు, మహిళలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. దళితులను హింసిస్తే సాక్షాత్తు మంత్రే సమర్థించడం రాష్ట్రంలో దళిత వ్యతిరేక పాలనకు నిదర్శనమన్నారు. కస్టడీలో ఉన్న వారిని కొట్టే హక్కు పోలీసులకు లేదన్నారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు దొందూ దొందే అని విమర్శించారు. సనాతన ధర్మాన్ని కాపాడాలని చిలకపలుకులు పలికిన మోదీ ఇప్పుడు మిజోరం ఎన్నికల్లో తమను గెలిపిస్తే బీఫ్‌ను ఆహారంగా ప్రకటిస్తామని చెప్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలను చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్రంలోని పరిస్థితులపై చర్చించి ప్రజా పోరాటాలపై కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.



రాజమహేంద్రవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ అక్కినేని మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల అనంతరం రాష్ట్రంలో మరో విద్యుత్ ఉద్యమం చేపడతామన్నారు. జగన్ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబు మీటర్లు బిగిస్తే బద్దలుకొడతామన్నారన్నారు. ఇప్పుడు అదే స్మార్ట్ మీటర్లను బిగించాలని ప్రయత్నిస్తున్నారని, అదానీ మీటర్లను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును జగన్ ప్రభుత్వం తగ్గించిందని ఆందోళన చేసిన చంద్రబాబు ఇప్పుడే అదే ఎత్తును ఎందుకు అంగీకరించారని ప్రశ్నించారు. పైగా అదే కాంట్రాక్టరుకే మళ్లీ ప్రాజెక్టును ఎలా అప్పగించారని నిలదీశారు. రాష్ట్రంలో ఎన్నో ప్రాజెక్టులు ఉండగా... వాటిని పూర్తి చేయకుండా కొత్తగా బనకచర్ల ప్రాజెక్టును తెరమీదకు తేవడం చూస్తే ఈ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు, కాంట్రాక్టర్ల కోసం పని చేస్తున్నట్టు ఉందని ధ్వజమెత్తారు. చంద్రబాబు సపోర్టుతో కేంద్రంలో ప్రభుత్వం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలను కూటమి ప్రభుత్వం కాపాడలేకపోతుందని మండిపడ్డారు.

విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, రేఖా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి స్నానానికి వెళ్లి వస్తూ... రోడ్డు ప్రమాదం

● కుమార్తె మృతి, కుమారుడి పరిస్థితి విషమం
● తీవ్రంగా గాయపడిన తల్లిదండ్రులు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి వెంకటదుర్గ



గాయాలపాలైన పండూరు రాంబాబు, వీరలక్ష్మి దంపతులు

గోకవరం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో గోదావరి స్నానానికి వెళ్లి వస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్తె మృతి చెందగా, కుమారుడి పరిస్థితి విషమంగా ఉండగా, తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని బావాజీపేట గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం... తూర్పుగోదావరిజిల్లా గోకవరం మండలం కామరాజుపేట గ్రామానికి చెందిన పండూరు రాంబాబు, వీరలక్ష్మీ దంపతులతోపాటు వారి కుమార్తె వెంకట దుర్గ(7), కుమారుడు పూర్ణకిరణ్‌లు వరలక్ష్మి పూజ సందర్భంగా మోటారు సైకిల్‌పై గోదావరిస్నానం చేసేందుకు గురువారం ఉదయం రాజమహేంద్రవరం వెళ్లారు. అక్కడ స్నానమాచరించిన అనంతరం తిరిగి స్వగ్రామం బయలు దేరి వస్తుండగా మండలంలోని బావాజీపేట -వీరలింకపల్లి గ్రామాల మధ్య వీరు ప్రయాణిస్తున్న మోటారుసైకిల్‌ను ఎదురుగా వస్తున్న గ్యాస్ ట్యాంకర్ ఢీకొంది. దీంతో రాంబాబుతోపాటు భార్య, కుమార్తె, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమార్తె వెంకటదుర్గ, కుమారుడు పూర్ణకిరణ్ పరస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ వెంకటదుర్గ మృతి చెందింది. పూర్ణకిరణ్ పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు రాంబాబు ఇటుక బట్టీలో కూలి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. జరిగిన సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశ తీరినా..ఊపిరిలేదు!

● నాలుగో కాన్పులో మగ పిల్లాడు.. ఆ తల్లి ఆశ తీరినా ప్రాణం నిలవలేదు
● 20 రోజులు ముందుగానే ఆసుపత్రిలో చేర్చినా ఫలితం దక్కలేదు
● రాజమహేంద్రవరం ఆసుపత్రికి చేరేసరికే గర్భిణీ, శిశువు మృతి
● ముగ్గురు పిల్లలను అనాథలను చేసి వెళ్లిపోయిన తల్లి
● ఘటనపై విచారణకు ఆదేశించామన్న ఐటీడీఏ పీవో




ముగ్గురు ఆడబిడ్డలు, మృత శిశువుతో పండా సింధూర మృతదేహం

రంపచోడవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆసుపత్రి నిర్లక్ష్యానికి ముగ్గురు ఆడబిడ్డల తల్లి తన నాల్గవ కాన్పులో ప్రసవ సమయంలో ప్రాణాలు కోల్పోగా, ఆమె గర్భంలో ఉన్న శిశువు కూడా మరణించింది. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం దామనపల్లికి చెందిన ముగ్గురు ఆడబిడ్డల తల్లి పండా సింధూరం(29)నాల్గవ కాన్పుకోసం జూలై 18న రంపచోడవరం ఏరియా ఆసుపత్రి లో చేరితే 20 రోజుల పర్యవేక్షణ అనంతరం బుధవారం ఆమెకు సహజప్రసవం చేయాలని ప్రయత్నించి విఫలమైన ఆసుపత్రి వైద్యులు పరిస్థితి చేయి దాటిపోయాక మాత్రం హుటాహుటిని రాత్రి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడికి చేరుకున్నాక తక్షణం సిజేరియన్ చేయాలని వైద్యులు నిర్ణయించారు. ఆమె మరణించడంతో గర్భంలో ఉన్న బిడ్డ కోసం సిజేరియన్‌చేసి చూస్తే ఆమె కడుపున ఉన్న మగబిడ్డ కూడా మరణించింది. పండా సింధూరం తన భర్తతో రాజమహేంద్రవరంలో జీవిస్తోంది.

ఆమె ఇప్పటికే ముగ్గురు ఆడపిల్లలకు సహజ ప్రసవంలో జన్మనిచ్చింది. నాల్గవ కాన్పులోనైనా దేవుడు తమకు మగబిడ్డను ప్రసాదిస్తాడని ఆ దంపతులు ఆశించారు. ఆశించినట్టుగానే ఆమె కడుపున మగబిడ్డ రూపుదిద్దుకుంది. తన పుట్టింటి వద్ద బంధువులు, అంగన్‌వాడీ, స్థానిక వైద్య-ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణ, ఎప్పటికపుడు వైద్యుల పర్యవేక్షణలో దామనపల్లిలోనే ఏంతో ఆశగా జీవించింది. వైద్యుల సూచనలతో ఆగస్టు మొదటివారంలో ప్రసవం జరగవచ్చునని గుర్తించి వారి సూచనతోనే ఈమెను జూలై 18న రంపచోడవరం ఆసుపత్రిలో చేర్పి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. కాగా బుధవారం ఆమెకు ప్రసవం వచ్చే అవకాశాన్ని గుర్తించిన వైద్యులు ప్రసవానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అందుకు తగ్గట్టుగానే ప్రసవ గదిలో ఆమెకు ప్రసవాన్ని కల్పించే చర్యలను చేపట్టారు. ఆమె ప్రసవం ప్రమాదభరితంగా మారిందని చివరిక్షణంలో బుధవారంరాత్రి రాజ మహేంద్రవరం ఆసుపత్రికి ఆమెను తరలించారు. కానీ అక్కడకు చేరుకునే సరికే పరిస్థితి చేజారిపోయింది. హుటాహుటిన సిజేరియన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడటం, ఆ పరిస్థితుల్లోనే సదరు మహిళ మృతి చెందడం, కడుపులో ఉన్న బిడ్డకోసం సిజేరియన్ చేసినా కడుపులో ఉన్న మగబిడ్డ మృతి చెందడం జరిగిపోయాయి. ఈ ఆసుపత్రిలో ఇటీవల ఇటువంటి నిర్లక్ష్య ఘటనలు పలు చోటుచేసుకున్నాయి. గత నెల లోనే వై.రామవరం మండలం జాజిగడ్డకు చెందిన కాకూరి పార్వతి ప్రసవం కోసం వచ్చి మృతి చెందగా, బిడ్డ ప్రాణాలతో మిగిలింది. రంపచోడవరానికి చెందిన మరో గిరిజన మహిళను కూడా ప్రసవం కోసం ప్రయత్నంచేసి విఫలమై ప్రసవం మధ్యలోనే రాజమండ్రికి తరలించగా మార్గమధ్యంలోనే అంబులెన్సులో ఆమె ప్రసవించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా అనేక సౌకర్యాలను కల్పిస్తే కేవలం నిర్లక్ష్యం కారణంగా గర్భిణులకు సుఖ ప్రసవాన్ని కల్పించడంలో మాత్రం ఈ ఆసుపత్రి విఫలమైంది. ఈ ఆసుపత్రిపై నిరంతర పర్యవేక్షణ ఉంచాల్సిన ఐటీడీఏ, ఇతర ఉన్నతాధికారులు సైతం ఏమీ పట్టనట్టు వ్యవహరించడంతోనే ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈతాజా ఘటనపై మాత్రం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం స్పందించి విచారణకు ఆదేశించారు. అల్లూరి, రాజమండ్రి జిల్లాల ఆరోగ్య సేవల కో-ఆర్డినేటర్లు విచారణ జరుపుతున్నారని, నివేదికలనుబట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

చామంతి ఏమిటే.. ఈ వింత!



చామంతి కిలో రూ.550 - శ్రావణం ఎఫెక్ట్

కడియం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కడియపులంక అంతర్‌రాష్ట్ర పూలమార్కెట్ నుంచి రాష్ట్రం నలుమూలలకు పూలు ఎగుమతి అవుతాయి. చామంతి, బంతి పూలు మాత్రం డిసెంబర్‌లో ప్రారంభమై మార్చి, ఏప్రిల్‌నెల వరకు ఉంటాయి. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి వంటి పండుగల వరకు మనప్రాంతంలో పూసిన బంతి, చామంతి పూలు మనకు లభిస్తాయి. మిగిలిన మాసాల్లో బంతి పూలను కర్నాటక రాష్ట్రం నుంచి, చామంతి పూలను తమిళనాడు నుంచి పూలవ్యాపారులు దిగుమతి చేసుకుని విక్రయాలు సాగిస్తుంటారు. ఆయా రాష్ట్రాల నుంచి రోజుకు 5వేల కేజీలు దిగుమతి చేసుకుంటే, శ్రావణమాసం, వివాహాల సమయంలో మాత్రం రోజుకు సుమారు 25నుంచి 30 టన్నుల వరకు పూలు దిగుమతి అవుతుంటాయని పూల వ్యాపారులు చెబుతున్నారు. ఈ ప్రాంతం నుంచి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు బస్సులు, వాహనాలద్వారా పూలను ఎగుమతి చేస్తుంటారు. మల్లెలు, జాజులు, కాగడాలు, లిల్లీ, కనకంబరం వంటి పూలు మాత్రం ఇక్కడే లభ్యమవుతాయి. వీటి ధరలు మాత్రం మామూలు రోజుల్లో సామాన్యంగా ఉంటే, ముహూర్తాలు, శుభకార్యాలు, పండుగలు, శ్రావణ శుక్రవారం వంటి రోజుల్లో మాత్రం మారుతుంటాయి.

కడియపులంక మార్కెట్‌లో పూల ధరలు

పూలు	గతంలో	ప్రస్తుతం
ఎల్లోచామంతి (కిలో)	రూ.250	రూ.550
వైట్‌చామంతి(కిలో)	రూ.200	రూ.500
నీలం చామంతి (కిలో)	రూ.200	రూ.350
కనకంబరం బారు(1)	రూ. 70	రూ.270
బంతి (కిలో)	రూ. 60	రూ.120
లిల్లీ (కిలో)	రూ.100	రూ.500
మల్లెలు (కిలో	రూ.600	రూ.1,000
కాగడాలు (కిలో	రూ.250	రూ.700
జాజులు (కిలో)	రూ.400	రూ.700



ఆనంద్ రీజెన్సీ సీజ్‌ను అడ్డుకుంటున్న కార్మికులు

ఆనంద్ రీజెన్సీ సీజ్‌కు బ్యాంక్ అధికారుల యత్నం

రాజమహేంద్రవరంసిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్ రీజెన్సీని సీజ్ చేయాలని ఏఆర్‌సిఐఎల్ బ్యాంక్ అధికారులు చేసిన ప్రయత్నాన్ని కార్మికులు అడ్డుకున్నారు. గురువారం స్థానిక కంబాలపేట సమీపంలో ఉన్న హోటల్ ఆనంద్‌రీజెన్సీకి బ్యాంక్ అధికారులు సీజ్ చేయడానికి వస్తున్నట్లుగా సమాచారం కార్మికులకు అందడం వారంతా హోటల్ ఎదుట నిరసన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గేటువద్ద బ్యాంక్ అధికారుల వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో సెంట్రల్ జోన్ డిఎస్‌పి రమేష్ బాబు పోలీస్ అధికారులు ఆనంద్‌రీజెన్సీ వద్దకు చేరుకున్నారు. బ్యాంక్ అధికారుల వాహనాన్నిఅడ్డుకోవడంతో ఉద్రిక్త వాతవరణం నెలకొనడంతో పోలీసులు సర్దిచెప్పారు. ఈసందర్భంగా రీజెన్సీ సీఈవో పీవీఆర్ మూర్తి విలేకరులతో మాట్లాడారు. చెన్నైలోని తమ యాజమాన్యం ఆనందరావు డవలపర్స్ పేరున ముంబైలోని ఎఆర్‌సీఐఎల్ బ్యాంక్ నుంచి గతంలో రూ42కోట్లు రుణం తీసుకున్నారని తీర్చలేకపోవడంతో రూ.700కోట్ల ఆస్తిని వారికి హ్యాండోవర్ చేశారని తెలిపారు. అదేవిధంగా రాజమహేంద్రవరంలోని ఆనంద్ రీజెన్సీ హోటల్‌ను గ్యారంటీగా పెట్టారని చెప్పారు. రుణం తీర్చలేకపోవడంతో ఎక్స్‌పార్టీ ఆర్డర్ తీసుకుని ఏపీ హైకోర్టు ద్వారా బ్యాంక్ వాళ్ళు వచ్చారని అయితే హోటల్‌ను సీజ్‌చేసే అధికారి వారికి లేదన్నారు. ఈ రోజు హోటల్‌లో వావాహ వేడుక జరుగుతుందని ఇలాంటి సమయంలో వచ్చి హోటల్ సీజ్ చేయాలనుకోవడం దారుణమన్నారు. ఆనంద్ రీజెన్సీపై ప్రత్యక్షంగా 250మంది కార్మికులు, పరోక్షంగా 400మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారని హోటల్‌ను సీజ్‌చేసి వారందరిని రోడ్డుపై పడేయాలనుకోవడం అన్యాయమన్నారు. రేపు న్యాయస్థానంలో తీర్పు వెల్లడించనున్నారని అంతవరకు ఆగాలని కోరారు. ఇప్పటికే హోటల్‌లో 30 రూమ్‌లను, కిచెన్‌ను సీజ్ చేసారని చెప్పారు. హోటల్‌ను స్వాధీనం చేసుకోవాలని ఆర్డర్‌వుంది తప్పితే సీజ్ చేయాలని లేదన్నారు.హోటల్ సీజ్ చేస్తేఊరుకోమని కార్మిక నాయకులు హెచ్చరించారు.

షాపులోకి దూసుకెళ్లిన కోళ్ల వ్యాన్

● టీ షాపు నిర్వాహకుడి మృతి
● తెల్లావారుజామున కావడంతో తప్పిన పెను ప్రమాదం



వాసంశెట్టి త్రిమూర్తులు (ఫైల్)

పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో షాపుల్లోకి దూసుకుపోయిన కోళ్ల లారీ, అంత్యక్రియల్లో భాగంగా పాడెమోసిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో గురువారం తెల్లావారుజామున కోళ్ల వ్యాన్ షాపుల్లోకి దూసుకుపోయిన ఘటనలో టీ షాపు నిర్వాహకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...పి.గన్నవరం గ్రామానికి చెందిన వాసంశెట్టి త్రిమూర్తులు(56) గత కొంతకాలంగా పి.గన్నవరం సెంటర్‌లో టీకొట్టు నిర్వహించుకుంటున్నాడు. ఈ క్రమంలో తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో టీ షాపును తెరిచేందుకు చేరుకున్న త్రిమూర్తులుషాపు ఎదురుగా శుభ్రం చేస్తుండగా గంటివైపు నుంచి కోళ్ల లోడుతో వస్తున్న వ్యాన్ వేగంగావచ్చి షాపుల్లోకి దూసుకుపోయింది. దీంతో త్రిమూర్తులుకు తీవ్రగాయం కావడంతో చికిత్స నిమిత్తం అమలాపురం తీసుకు వెళ్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. త్రిమూర్తులుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పడే ఇంటి నుంచి షాపుకు వచ్చారని ఇంతలోనే ఘోరం జరిగిపోయిందని కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు స్థానికులను కన్నీరు పెట్టిస్తోంది. అమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించామని మృతుడు బంధువులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జ్యూస్ షాపుతోపాటు టీషాపు, చెరకు రసం షాపుల ముందు భాగంలో ఉండే షెడ్లు నుజ్జు నుజ్జు అయ్యాయి. త్రిమూర్తులు అకాల మరణానికి సంతాపంగా స్థానిక వర్తక సంఘం సభ్యులు మధ్యాహ్నం వరకు షాపులు బంద్‌చేసి తమ ప్రగాడ సానుభూతిని తెలిపారు. పి.గన్నవరంలో జరిగిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ త్రిమూర్తులు మృతదేహానికి నివాళులర్పించిన అనంతరం ఆయన స్వయంగా పాడెమోసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈయాత్రలో కూటమి నాయకులు కుమార్ పాల్గొన్నారు.

ప్రియుడే హంతకుడు..

● తల్లీ, ఇద్దరు కుమార్తెల హత్య కేసులో వీడిన మిస్టరీ..
● వివాహేతర సంబంధంతోనే... లారీ ఓనర్ కమ్ డ్రైవర్ తలే సురేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు
● వివరాలు వెల్లడించిన ఎస్పీ

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా సామర్లకోటలో సంచలనం రేపిన తల్లీకూతుళ్ల హత్య కేసులో నిందితుడు పోలీసులకు చిక్కాడు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని తేల్చారు. ఈనెల రెండో తేదీ రాత్రి సామర్లకోట సీతారామకాలనీలో నివాసం ఉండే ములపర్తి మాధురి (29), ఆమె కుమార్తెలు పుష్పకుమారి(8), ప్రైజీ జెస్సీలోన (6) హత్యకు గురై రక్తపు మడుగులో పడిఉన్నారు. రాత్రి డ్యూటీకి వెళ్లి ఉదయం ఇంటికి వెళ్లిన వచ్చిన భర్త తీవ్రరక్తస్రావంతో విగతజీవుల్లా పడి ఉన్న భార్య, పిల్లలను చూసి కుప్పకూలిపోయాడు. వెంటనే విషయాన్ని కుటుంబసభ్యులకు, పోలీసులకు తెలియజేశాడు. దీనిపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సంఘటన జరిగిన రోజు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సంఘటన స్థలానికి చేరుకుని, హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాల ను ఏర్పాటు చేసి గాలించారు. చివరికి మాధురి ప్రియుడే హంతకుడు అని తేల్చారు. ఆ వివరాలను గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మీడియాకు వెల్లడించారు. సామర్లకోటలో సంచలనం రేపిన హత్యకేసులో అదే ప్రాంతంలోని కొత్తపేటకు చెందిన తలే సురేష్ అనే ట్రక్కు ఓనర్ కం డ్రైవర్ ముద్దాయి అని తెలిపారు. ఇతడు రెండేళ్లుగా మాధురితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని, ఆమె కుటుంబ అవసరాలు తీరుస్తూ సహకరించేవాడని పేర్కొన్నారు. ఈ రెండేళ్లలో సురేష్ సుమారు రూ.ఏడు లక్షలను ఆమెతో పాటు, ఆమె కుటుంబసభ్యులకు ఖర్చుచేయడంతో తరచూ మాధురి, సురేష్ మధ్య వివాదాలు రేగడం, తనను తన భర్త నుంచి దూరంగా తీసుకువెళ్లిపోవాలని ఒత్తిడి చేయడం, మరోవైపు ఈ వివాహేతర సంబంధం విషయం సురేష్ భార్యకు తెలిసిపోవడంతో చివరికి మాధురిని అంతం చేయాలని నిర్ణయించుకున్నాడని ఎస్పీ వివరించారు.

మాటామాటా పెరిగి..

రెండో తేదీ రాత్రి పది గంటల తర్వాత మాధురి తన భర్త లేడు రమ్మని సురేష్‌ను పిలవడంతో ఇదే అదనుగా భావించిన సురేష్ మాధురిని హతమార్చేందుకు దుడ్డుకర్రను తన లారీ నుంచి తీసుకుని వెళ్లి ఇంటి గుమ్మం వద్ద వెనుక పెట్టి ఇంట్లోకి ప్రవేశించాడని, కొంతసేపు వీరిద్దరూ మాట్లాడుకున్నారని, అనంతరం ఇరువురి మధ్య బంగారు వస్తువులు, వాషింగ్ మెషీన్ విషయమై మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన సురేష్ తన వెంట తెచ్చుకున్న దుడ్డు కర్రతో తలపై బలంగా మోదీ చంపినట్టు ఎస్పీ చెప్పారు. ఆ సమయంలో కేకలు విని నిద్ర లేచిన చిన్నారులు పుష్పకుమారి, ప్రైజీజెస్సీలోనలను తలపై బలంగా మోది హతమార్చాడన్నారు. అనంతరం మాధురి ఇంటిలో దాచి ఉంచిన బంగారు నగలు, రెండు సెల్‌ఫోన్లు, దుడ్డుకర్రను పట్టుకుని ఇంటి వెనుకనుంచి బయటకు వచ్చి లారీలో కాకినాడ - యానాం మీదుగా వెళ్లిపోయాడని ఎస్పీ తెలిపారు.

సామర్లకోట సుగర్ ఫ్యాక్టరీ వద్ద...

తనపై పోలీసులకు అనుమానం వచ్చిందనే విషయం తెలుసుకున్న సురేష్ ఈ కేసు విషయమై ఓ న్యాయవాది సలహా తీసుకునేందుకు సామర్లకోట రాగా, అతడిని పోలీసులు సుగర్ ఫ్యాక్టరీ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి లారీ, రూ.రెండున్నర లక్షల విలువ జేసే బంగారు వస్తువులు, అతడి సెల్‌ఫోను, హత్యకు ఉపయోగించిన దుడ్డుకర్రను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. ఈకేసును వేగంగా ఛేదించడంలో సహకరించిన పోలీలను విభాగాలను ఎస్పీ అభినందించారు. పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు, ఎస్‌బీ డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ, పెద్దాపురం క్రైం సీఐ ఆర్.అంకబాబు, సామర్లకోట సీఐ కృష్ణభగవాన్, తుని ఎస్సై విజయబాబు, పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం కాదు... పెట్రోల్ పోసి అంటించారు

● యానాం ఏటీఎంలో జరిగిన ప్రమాదాన్ని ఛేదించిన పోలీసులు
● రూ.12 లక్షల మేర చోరీ ● ఇద్దరి అరెస్టు



ఏటీఎం నిందితులతో యానాం పోలీసులు

యానాం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): యానాం బస్టాండ్ వెనుక ఉన్న కంచర్ల కాంప్లెక్స్‌లోని ఏటీఎంలో గతనెల 8వ తేదీన జరిగింది .. అగ్నిప్రమాదం కాదని కావాలనే పెట్రోల్ పోసి అంటించారని యానాం పోలీసులు గుర్తించారు. వారి వివరాల మేరకు గత నెలలో ఎస్‌బీఐ ఏటీఎంలో ఒక్కసారిగా మంటలు చేలరేగడంతో అక్కడే ఉన్న మెకానిక్ షెడ్డుకు సంబంధించిన ఐదు ద్విచక్రవాహనంతో పాటు ఒక కారు పూర్తిగా కాలిపోయిన విషయం తెలిసిందే. యానాం ఇన్‌చార్జి ఎస్పీ, సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐలు పూనిత్‌రాజ్, కట్టా సుబ్బారాజు క్రైం టీమ్‌తో విచారణ చేపట్టారు. సీసీ పుటేజీ ఆధారంగా ఒక వ్యక్తిని గుర్తించడం జరిగింది. ఏటీ ఎంలో క్యాష్ డిపాజిట్ చేసే వ్యక్తులు ఈ సంఘటనకు పాల్పడినట్టు తెలిసింది. ఇందులో కాజులూరు మండలం కుయ్యేరుకు చెందిన వెంకటేష్ (బిట్టు), సరేంద్రపాడుకు చెందిన అనిల్‌బాబును అదుపులోకి తీసుకున్నారు. వీరు ప్రక్క ప్రణాళికతో 10 లీటర్లు పెట్రోలు తీసుకువచ్చి ఏటీఎం వేసి నిప్పు పెట్టినట్టు తెలిసింది. దీనికి ప్రధాన కారాణం గత రెండు సంవత్సరాలుగా ఏటీఎంలలో క్యాష్ డిపాజిట్ చేస్తూ తన సొంత అవసరాల నిమిత్తం పది, ఇరవై, యాభైలు చొప్పున వాడుకోవడం, జీతాలు అందిన తరువాత వాటిని మరలా డిపాజిట్ చేయడం జరుగుతోంది. ఈనేపథ్యంలో సుమారు రూ.12 లక్షల వరకు బకాయి పడ్డారు. దీనిని తిరిగిచెల్లించేందుకు డబ్బులు లేకపోవడంతో పక్కాప్రణాళికతో ఏటీఎంను కాల్చిస్తే మనం డబ్బులు కట్టినవసరం లేదనే ఉద్దేశంతో ఈ సంఘటనకు పాల్పడ్డారు. క్రైంటీమ్ సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను గాలించి పట్టుకోవడం జరిగిందన్నారు. వీరిని అదుపులోకి తీసుకొవడంతో పాటు వారి వద్ద నుంచి ఆ డబ్బులతో కొనుగోలు చేసిన కారు, సెల్‌ఫోన్లు, బట్టలను స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించడం జరిగిందని తెలిపారు.

గుర్తేడు కేంద్రంగా... 59 గ్రామాలతో 'అల్లూరి'లో కొత్త మండలం

● అభిప్రాయాల కోసం జిల్లా ఏర్పాటు చట్టం కింద నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం
● ఏడుగురు ఐఏఎస్‌ల కిడ్నాప్‌తో దేశ వ్యాప్తంగా గుర్తేడుకు గుర్తింపు

రంపచోడవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి మన్యంలోని రంపచోడవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో గుర్తేడు కేంద్రంగా 59 గ్రామాలతో కొత్త మండలాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంగా ఉన్న గుర్తేడు 1987లో ఏడుగురు ఐఏఎస్ అధికారులను అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్లు కిడ్నాప్ చేసిన ఘటనతో దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. తర్వాత ఈ పరిసర ప్రాంతాల అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో అభివృద్ధికి ఆటంకంగా మారింది. దీనికి పరిష్కారంగా వై.రామవరం మండలంలోని ఎగువ ప్రాంతంగా ఉన్న సుమారు గుర్తేడు, పాతకోట, దారగడ్డ, బొడ్డగండి, కానివాడ, చింతలపూడి పంచాయతీలలోని 59 గ్రామాల కోసం ఈ మండలాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గతం కొన్ని దశాబ్ధాలుగా ఈ మండలాల ఏర్పాటుపై టీడీపీ ప్రభుత్వమే ఎంతో కసరత్తు చేసింది. ముఖ్యంగా ఈ ఆరు పంచాయతీలలో అభివృద్ధిపరంగా వెనుకబాటుతనాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఈ ప్రాంతంలో ఏ అభివృద్ధి సాగించాలన్నా... ఇక్కడికి సుమారు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న వై.రామవరానికి చేరుకోవడం, లేదా అధికారులు అక్కడి నుంచి ఇక్కడకు చేరుకోవడం ఎంతో వ్యయ, ప్రయాశలతో కూడినది కావడంతో ఇక్కడ మండలం ఏర్పాటు అనివార్యంగా మారింది. కాగా ఇప్పటికే గుర్తేడుకు పోలీసుస్టేషన్ మంజూరై గత దశాబ్ధన్నరకాలంగా మారేడుమిల్లిలో నడుస్తోంది. ఇటీవల కాలంలో గుర్తేడులోనే పోలీసుస్టేషన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం తాజా నోటిఫికేషన్‌తో ఈ మండల ఏర్పాటు కల నిజం కాబోతోంది. జిల్లాల ఏర్పాటు చట్టం కింద గురువారం జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు అల్లూరి జిల్లా కలెక్టరు తదనంతర చర్యలు చేపట్టి ప్రజల నుంచి అభిప్రాయాలను, సలహాలను తీసుకుని నివేదిక సమర్పిస్తే తదనంతరం మరో నోటిఫికేషన్ ద్వారా వై.రామవరం మండలం సరిహద్దులను మార్చి, గుర్తేడు మండలానికి సరిహద్దులను ఏర్పాటు చేసి మరో నోటిఫికేషన్ జారీ చేస్తారు.

సినీ ఫక్కీలో..సచివాలయ ఉద్యోగి కిడ్నాప్

● ఉప సర్పంచ్, సిబ్బందిని కత్తులతో బెదిరించిన వైనం
● ప్రేమికుడిపై అనుమానం.. రంగంలోకి దిగిన పోలీసులు

దేవీపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలం శరభవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సోయం సౌమ్యశ్రీ గురువారం కిడ్నాప్‌కి గురైంది. వివరాలిలా ఉన్నాయి.. సౌమ్యశ్రీ రోజు మాదిరిగానే గురువారం ఉదయం సచివాలయానికి విధులకు వెళ్లింది. అయితే కొద్దిసేపటికే ఇన్నోవా వాహనంలో సుమారు ఏడుగురు వ్యక్తులు సచివాలయంలోకి చొరబడి అక్కడున్న ఉప సర్పంచ్, సచివాలయ సిబ్బందిని కత్తులతో బెదిరించి కిడ్నాప్ చేశారు. ఈ విషయాన్ని వెంటనే సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న రంపచోడవరం డీఎస్పీ, సీఐ సన్యాసిరావు, దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విస్తృతంగా సాంకేతిక పరిజ్ఞానం తో గాలింపు చర్యలు చేపడుతున్నారు. కాగా గతంలో ఈమె తన ప్రేమికుడు మారేడుమిల్లి మండలం వేటుకూరి గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌తో కలిసి సుమారు నెలరోజులు కనిపించకుండాపోయినట్టు పోలీసులు తెలిపారు. దీనిపై అప్పట్లో కేసు నమోదు చేసి దొరికిన తర్వాత తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇప్పుడు ఈ కిడ్నాప్ ఘటన చూస్తుంటే ప్రేమికుడు చేసిన వ్యవహారంగా పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై సౌమ్యశ్రీ తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై అత్యాచారం కేసులో... ఒడిశా వాసిపై పోక్సో కేసు నమోదు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని బంధువుల ఇంటికి వెళ్లిన మైనర్ బాలికకు పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి అత్యాచారం చేయడమే కాకుండా, బ్లాక్ మెయిల్‌కి పాల్పడుతున్న వ్యక్తిపై సర్పవరం పోలీసులు గురువారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యా రావుపేటకు చెందిన మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటర్ చదువుతోంది. ఎనిమిది నెలల కిందట ఒడిశాలోని పూరీలో గల బంధువుల ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో అదే ప్రాంతంలో ఉంటున్న ఒడిశా వాసి కుక్కల దుర్యోధనుడితో పరిచయం ఏర్పడింది. అతని పెళ్లి చేసుకుంటానని చెప్పి సదరు మైనర్ బాలికపై జనవరిలో కాకినాడ రూరల్ రమణయ్యపేట మురళీధర్‌నగర్‌లో ఉన్న ఓ లాడ్జికి రప్పించుకుని అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆ సమయంలో తీసిన ఫొటోలతో బ్లాక్ మెయిల్‌కి పాల్పడటమే కాకుండా మరోసారి సదరు లాడ్జికి రావాలని వేధింపులకు గురిచేస్తున్నాడు. నిందితుడి వేధింపులు తట్టుకోలేని బాధితురాలు కుటుంబ సభ్యులకు జరిగిన విషయం చెప్పడంతో బుధవారం సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌హెచ్‌వో బి. పెద్దిరాజు వెళ్లి సదరు లాడ్జిని పరిశీలించి విచారణ చేపట్టారు. దీనిపై హోటల్ తాలూకా రికార్డులు, అనుమతి పత్రాలు, సీసీ పుటేజీలను పరిశీలించాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. నిందితుడిపై పోక్సో యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

● పోలీసు కేసు నమోదు



గోపాలకృష్ణ(ఫైల్)

ఉప్పలగుప్తం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): భీమనపల్లి పంచాయతీ భట్టుపాలెంకు చెందిన మోటూరి గోపాలకృష్ణ (35) మోటారుకు వైరు మార్చే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గురువారం కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్టు ఎస్ఐ సీహెచ్ రాజేష్ తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

19న వేద శాస్త్ర పండిత సభ

పెద్దాపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజుగారి వీధిలో గల ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ నెల 19వ తేదీన 46వ వేద శాస్త్ర పండిత సన్మాన పరిషత్ సభ నిర్వహించనున్నట్లు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అళ్లక్కి కృష్ణ, ఆణివిళ్ల శాస్త్రి (త్రినిటి శాస్త్రి) తెలిపారు. పలువురు ఘనాపాఠీలు, క్రమాపాఠీలు, స్మార్త, వేద పండితులను ఘనంగా సన్మానిస్తామని చెప్పారు.

తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సామర్లకోట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కుళాయిల నుంచి బురద నీరు, పసరు రంగు నీరు రావడానికి గల కారణాలను మున్సిపల్ అధికారులు గురువారం ఎట్టకేలకు గుర్తించారు. పెద్దాపురం రోడ్డు శివారున గల బడేలమ్మ చెరువు నుంచి కలుషిత నీటిని బయటకు పంపేందుకు మూడు రోజులుగా చేపల పెంపకందారుడు చేసిన పనులతో తాగునీటి పైప్‌లైను ఛిద్రమైంది. ఈ కారణంగా పైప్‌లైను ప్రధాన జాయింట్ వద్ద ఏర్పడిన లీకుల వద్దకు చేపల చెరువు నుంచి వచ్చే పసరు రంగునీరు చేరింది. ఆ నీరు తిరిగి పైప్‌లైనులోకి చేరి కుళాయిల్లోంచి పసరు, బురద నీరొచ్చింది. కమిషనరు శ్రీవిద్య, మున్సిపల్ ఏఈ, వాటర్‌వర్క్స్ సిబ్బంది పైప్‌లైను లీకులను నిరోధించే పనులను ముమ్మరం చేశారు. కౌన్సిలర్లు బలుసు శ్రీనివాసు, బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): 'ప్రధాన పైప్‌లైన్‌కు లీకులు, తాగునీరు వృథా' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కొత్తపల్లి కాపుల రామాలయం సమీపంలో తాగునీటి ప్రధాన పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేశారు. తాగునీటి వృథాను వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'కి గ్రామస్థులు అభినందనలు తెలిపారు.



గుర్రపు బగ్గీపై పెండ్లి కుమారుడు

లయన్స్ క్లబ్ చైర్మన్ డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు కుమారుడు వివాహ వేళ ఊరేగింపు ఆకట్టుకుంది. పెళ్లి కుమారుడైన వీరబాబును గుర్రపు బగ్గీలో మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ గురువారం సాయంత్రం ఊరేగించారు. నెత్తిన టోపీ ధరించి రాజకుమారుడిలా వున్న వరుడిని పలువురు ఆసక్తిగా తిలకించారు.

-సామర్లకోట

ద్వారంపూడి అనుచరుడి తనయుని మోసంపై ఫిర్యాదు

కాకినాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అనుచరుడు, మాజీ కార్పొరేటర్ చోడిపల్లి సత్యప్రసాద్ రెండో కుమారుడు అవినాష్‌రామ్ వద్ద డబ్బు అవసరం నిమిత్తం తన ఇంటిని తనఖా పెడితే తప్పుడు ధ్రువపత్రాలతో వేరొకరికి విక్రయించి మోసం చేశాడని జగన్నాథపురం నక్కా వారి వీధికి చెందిన బాధితురాలు కాంచన దుర్గ మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ జరిపించి ఏ ఆధారం లేని తమకు న్యాయం చేయాలని ఆమె బుధవారం వినతిపత్రం అందజేశారు.

'జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి'



ఐడియల్ కళాశాలలో జరిగిన మెగా జాబ్‌మేళా ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్

కాకినాడ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను నిరుద్యోగ యువతీ, యవకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. వికాస ఆధ్వర్యంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సహకారంతో గురువారం కాకినాడ ఐడియల్ ఐడియల్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ముఖ్య అతిథులుగా విచ్చేసిన కలెక్టర్ షాన్‌మోహన్, సిటీ ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ప్రారంభించగా వికాస పీడీ కె.లచ్చారావు పర్యవేక్షించారు. 35 కంపెనీల ప్రతినిధులు 1,200 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 1,150 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు. వివిధ కంపెనీలకు ఎంపికైన 648 మందికి అతిథులు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐడియల్ కళాశాల ప్రిన్సిపాల్ టి.సత్యనారాయణ, కరస్పాండెంట్ పీఎస్ఎస్ కిరణ్, డైరెక్టర్ ఎం.రంజిత్, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడు వనమాడి మోహనవర్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు, వికాస సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తపల్లి మండలం వాకతిప్పలో చేనేత కార్మికులను సత్కరిస్తున్న కాకినాడ జీజీహెచ్ డైరెక్టర్ అక్షయ్



గొల్లప్రోలు మండలం దుర్గాడలో మగ్గంపై వస్త్రాలు నేస్తున్న నేతలను జనసేన నాయకుడు జ్యోతుల శ్రీనివాస్



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఐక్యత చాటుతున్న వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ ప్రతినిధులు

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

కొత్తపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేనేత రంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటోందని జనసేన నాయకుడు, కాకినాడ జీజీహెచ్ డైరెక్టర్ రావు అక్షయ్ అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా వాకతిప్పలో చేనేత సీనియర్ కార్మికులను ఆయన సత్కరించారు. చేనేత వస్త్రాల తయారీకి ముడి సరుకులను విక్రయించే డిపో ఏర్పాటు చేయించాలని పలువురు నేతన్నలు విజ్ఞప్తి చేశారు. మగ్గాలపై తయారు చేసే వస్త్రాలను ఆప్కో కొనుగోలు చేయాలని, జీఎస్టీ రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికులు తెలిపిన వివిధ సమస్యలను ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్తానని అక్షయ్ హామీ ఇచ్చారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడలో మార్కండేయ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో నేటికీ మగ్గంపై వస్త్రాలు నేస్తున్న 65మంది చేనేత కార్మికులను సత్కరించారు. చేనేత రంగానికి వారు చేస్తున్న సేవలను కొనియాడారు. జనసేన నాయకుడు, సాయిప్రియ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చేనేత సొసైటీ కార్యదర్శి తీడ నాగరాజు, చేశెట్టి సూర్యనారాయణ, బేతా సత్యనారాయణ, మాడెం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వస్త్రాలకు గిట్టుబాటు ధర లేక చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని ఆయన కోరారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో పద్మశాలీ యూత్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. పవర్‌లూమ్ నుంచి పోటీ, మార్కెట్ లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపన రామకృష్ణ, ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నగంటి సత్యనారాయణ, శీరం లక్ష్మణమూర్తి, పడాల అప్పారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, చేనేత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'శ్రీప్రకాష్'లో బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

కాకినాడ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ క్లస్టర్-7 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు కాకినాడ సురేష్‌నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో జరగనున్నాయని డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ పోటీలు బాలుర అండర్-14, 17, 19 విభాగాల్లో జరుగుతాయని, ఏపీ, తెలంగాణలకు చెందిన సీబీఎస్ పాఠశాలల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు సీబీఎస్ఈ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత పొందుతారని విజయ్‌ప్రకాష్ చెప్పారు.

వెంకటేశ్వరరెడ్డి సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీగా ఆమోదం



జేఎన్టీయూకే, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పరిశీలకుల బృందం సిఫార్సు మేరకు కె.వెంకటేశ్వరరెడ్డి సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీగా జేఎన్టీయూకే ఆమోద ముద్ర లభించినట్టు వర్శిటీ పీఆర్వో, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఎఫిషియంట్ వీఎల్ఎస్ఐ ఇంప్లిమెంటేషన్ ఫర్ న్యూరో మార్ఫిక్ కంప్యూటింగ్ అంశంపై ఈయన తన సిద్ధాంత వ్యాసాన్ని జేఎన్టీయూకేలోని యూసీఈకే ఈసీఈ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.బాలాజీ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు. వెంకటేశ్వరరెడ్డికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు ఈసీఈ విభాగంలో లభించిందన్నారు.

ఆరుగురు అనాథ పిల్లలకు డిప్యూటీ సీఎం సాయం

కొత్తపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన జీతం నుంచి పంపిన మొత్తంలో మండలంలోని ఆరుగురికి ఒక్కొక్కరికీ రూ.5వేలు చొప్పున గురువారం అందజేశారు. కొండెవరంలో ఒకరు, వాకతిప్పలో ఇద్దరు, గోర్సలో ఇద్దరు, కొత్త ఇసుకపల్లిలో ఒకరికి ఉప్పాడకు చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు దొడ్డి దుర్గాప్రసాద్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులైన మాజీ సర్పంచ్ మత్సా అప్పాజీ, వేగిశెట్టి సూర్య నికిల్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

దూబగుంట రోశమ్మ వర్ధంతి

పిఠాపురం రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలంలోని గ్రామాల్లో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో మద్య నిషేధ ఉద్యమ రూపకర్త దూబగుంట రోశమ్మ వర్ధంతి నిర్వహించారు. మంగితుర్తిలో కమిటీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, వనపర్తి సూర్యనారాయణ, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తదితరులు, గోకివాడలో కమిటీ నాయకులు వేమగిరి తలుపులయ్య, కొమ్ము చినబాబు, వేమగిరి చిన్నారి, భవానీ, లోడ సూరిబాబు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మద్యం, సారా, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

90 మంది పేదలకు దుస్తులు, కళ్లజోళ్లు పంపిణీ

కాకినాడ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ లయన్స్ క్లబ్ హాల్లో రెడ్ కాన్వెంట్ విద్యార్థుల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 90 మంది పేదలకు దుస్తులు, కళ్లజోళ్లను ముఖ్య అతిథి డాక్టర్ బాదం బాలకృష్ణ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీను, జరీనా పాల్గొన్నారు.

మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక సాయం



మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక సముద్ర జలాల్లో పట్టుబడిన నాలుగు మత్స్యకార కుటుంబాలకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు గురువారం తన నివాసంలో ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.20వేలు చొప్పున చెక్కు, సరుకులు అందించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ మత్స్యకారులను త్వరితగతిన తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ వి.కృష్ణారావు, అసిస్టెంట్ డైరెక్టర్ కె.కరుణాకరరావు, ఎఫ్‌డీవోలు జి.గోపి, క్షేత్రప్రకాష్, కాకినాడ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంగాని నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నాటి ధర్మారావు, కోశాధికారి చింతా పేర్రాజు, ఉపాధ్యక్షులు మల్లాడి రాజు, పాలెపు ధర్మారావు, లంకే నూకరాజు, జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షుడు బలసాడి రంగారావు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి హిమాఘ్నరాజ్ భట్టాచార్య

'యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి'

కాకినాడ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి హిమాఘ్నరాజ్ భట్టాచార్య కోరారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశం ఎంవీ రమణ అధ్యక్షతన గురువారం జరిగింది. భట్టాచార్య మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేనంత పెద్ద సంఖ్యలో యువత మన దేశంలో ఉందన్నారు. 40 సంవత్సరాల లోపు యువత 65శాతం మంది ఉన్నారన్నారు. చదువుకున్నవారు, చదువులేని వారు ఉపాధి లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోపక్క డ్రగ్స్ యువతను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. యువతను చైతన్యపరచడానికి, వారిని డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడానికి ఉద్యమానికి సిద్ధమవుతున్నామన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవీ రమణ, రాజు, శివ, కిరణ్ రమేష్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో దేశభక్తి, అభ్యుదయ గీతాల శిక్షణ

కాకినాడ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ యూటీఎఫ్ టీచర్స్ హోంలో ఈ నెల 9,10 తేదీల్లో దేశభక్తి, అభ్యుదయ గీతాల శిక్షణ ఏర్పాటు చేసినట్టు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ సూరిబాబు, కేవీవీ నగేష్, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఎంఎంఆర్ ప్రసాద్, జీఎస్ వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనల్లో ఆలపించేందుకు దేశభక్తి, అభ్యుదయ పాటల్లో శిక్షణ ఇస్తామన్నారు. నగర, పరిసరాల్లోని వివిధ పాఠశాలల విద్యార్థులు శని, ఆదివారాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిక్షణలో పాల్గొనాలని కోరారు. వివరాలకు సీహెచ్ వెంకటరమణను 90100 44277 నెంబరులో సంప్రదించాలన్నారు.

పాదగయకు పోటెత్తిన భక్తులు... పుష్కరిణిలో పుణ్యస్నానాలు

పిఠాపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రానికి గురువారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసాల్లో ఇంటి వద్ద వరలక్ష్మి వ్రతం ఆచరించే మహిళలు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. స్నానాలు చేసిన తర్వాత కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయంలో దీపాలు వెలిగించి ప్రార్థనలు జరిపారు. పాదగయ మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాల్లో తరలించారు. కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.





సామర్లకోటలో భారీ వర్షానికి రోడ్డుపైకి చేరిన మురుగునీరు

భారీ వర్షం

సామర్లకోట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. జయలక్ష్మి థియేటర్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, వీర్రాఘవపురం, మెహెర్ కాంప్లెక్స్ రోడ్డు, వెలంపేట రోడ్డులో డ్రైన్లు పొంగిపొర్లడంతో దుర్గంధభరితంగా మారాయి. కాగా ఈ వర్షంతో ఖరీఫ్ వరి సాగుకు మాత్రమే గాక మెట్ట ప్రాంతంలో సాగులో ఉన్న కర్రపెండలం దుంప పంటకు అదనపు నీటి తడులు అందాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు. కర్ర పెండలం మొక్కలు చిగురించి అధిక పిలకలు తొడిగే అవకాశాలున్నాయని దుంప రైతు బర్రే కొండలరావు చెప్పాడు. మెట్ట ప్రాంతాల్లో సాగవుతున్న పామాయిల్‌తో పాటు బంతి, వంగ, చిక్కుడు, బీర, బెండ మొక్కలకు అదనపు నీరు అందిందని పలువురు రైతులు చెప్పారు.



కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో గురు వారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి డ్రైన్లు పొంగి ప్రవహించాయి. సుమారు 20 రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడిపోతున్న ప్రజలు చల్లదనంతో సేదతీరారు. వర్షాలు కురువక ఎండిపోతున్న సార్వా చేలకు భారీ వర్షం ఊపిరి పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

రేషన్ షాపులో చోరీ

కాకినాడ క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగన్నాథపురం భవన్నారాయణ సెంటర్ సమీపంలోని మసీదు వద్ద చౌక ధరల దుకాణానికి పి.నాగేశ్వరరావు డీలర్‌గా వ్యవహరిస్తున్నాడు. బుధవారం రాత్రి షాపు తాళాలు వేసి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించాడు. లోపలికి వెళ్లి చూసేసరికి 50 కిలోల బస్తాలు ఐదు అపహరణకు గురైనట్టు గుర్తించాడు. అనంతరం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు రేషన్ షాపులో పనిచేసే వీరబాబు, సాయి కలిసి చోరీకి పాల్పడినట్టు ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

'రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తాం'



రైతులతో మాట్లాడుతున్న పండూరు సొసైటీ చైర్మన్ రామ్‌కుమార్

సర్పవరం జంక్షన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం చేస్తున్న రైతుల ఆర్థిక స్థితి పెంపులో సొసైటీని భాగస్వామిగా చేస్తూ వారి జీవన ప్రమాణ స్థాయిని పెంచేందుకు కృషి చేస్తామని పండూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ తెలిపారు. బుధవారం పండూరు సొసైటీ కార్యాలయంలో ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్, రబీ పంటలకు సకాలంలో రుణాల మంజూరు, ఉత్పత్తి ఖర్చులకు సహకారం, పంట కొనుగోలు, రాయితీ అంశాల్లో రైతులకు మేలు చేసేలా కృషి చేస్తానన్నారు. రైతుల అవసరాలు గుర్తించి వరి సాగుకు మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. రుణాలు తీసుకున్న రైతులు వాటిని సకాలంలో తిరిగి చెల్లించి ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుకోవాలని కోరారు. రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డైరెక్టర్ ఎన్.సురేష్, బీజేపీ మండల అధ్యక్షులు నందూరి సత్తిబాబు, బి.రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్సవ సమితి కో-ఆర్డినేటర్ రంబాల వెంకటేశ్వరరావు. చిత్రంలో దూసర్లపూడి రమణరాజు, మాలకొండయ్య

వినాయక చవితి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న ప్రారంభమయ్యే వినాయక చవితి మహోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు గణేష్ ఉత్సవ సమితి రూరల్ కో-ఆర్డినేటర్ రంబాల వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో గల శుభం కాపు కల్యాణ మండపంలో కాకినాడ రూరల్ సాగర గణపతి నిమజ్జనోత్సవ సమాయత్త ముందస్తు సమావేశాన్ని సభ్యులతో నిర్వహించారు. ఈ సందర్భంగా రంబాల మాట్లాడుతూ సెప్టెంబరు 6, 7 తేదీల్లో విగ్రహాల నిమజ్జనం సూర్యారావుపేట బీచ్‌లో జరుగుతుందన్నారు. కాకినాడ వార్ఫ్ రోడ్డు వినాయకసాగర్‌లో గత 37 ఏళ్లుగా వివిధ శాఖల అధికారుల సహకారంతో గణేశ నిమజ్జనం నిర్వహిస్తున్నామని నగర గణేష్ ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు, జిల్లా అధ్యక్షుడు వై.మాల కొండయ్య తెలిపారు. వినాయకచవితి మహోత్సవం నిర్వహణ, మండపాల ఏర్పాట్లు, అనుమతులు, ముందస్తు భద్రతా చర్యలపై చర్చించారు. సమా వేశంలో సభ్యులు పైడా భవానీప్రసాద్, శ్రీనివాస్, కవికొండల చలపతిరావు, తమ్మలపల్లి నాని, మణిబాల, గోపి, వినాయక మాధవరావు, ఎన్. సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



చెందుర్తి పాఠశాలలకు కంప్యూటర్ల బహూకరణ

గొల్లప్రోలు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నూకాలమ్మ గుడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు గ్రామానికి చెందిన జగ్గారపు గణేష్‌స్వామి, వెంకటేశ్వరరావు రెండు కంప్యూటర్లు బహూకరించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో వీటిని పాఠశాల ఎస్ఎంసీల చైర్మన్లు, హెచ్ఎంలు జగ్గారపు శ్రీనివాసరావు, పలివెల గోపాలకృష్ణ, సబ్బవరపు సతీష్, ఎర్ర కృష్ణమూర్తిలకు అందజేశారు. దాతలను సత్కరించారు.

వర్షంతో రైతుల హర్షం

రౌతులపూడి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా కాస్తున్న ఎండలకు ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సాయంత్రం వర్షం పడడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందగా, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రౌతులపూడిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా వర్షం నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక వర్షం వచ్చిన ప్రతిసారీ నీరు నిల్వ ఉంటోందని వ్యాఖ్యానిస్తున్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

దేవీపట్నం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేటలోని స్త్రీశక్తి భవనంలో ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు దేవీపట్నం తహసీల్దార్ కె.సత్యనారాయణ అన్నారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వేడుకలను ఆదివాసీ ఉద్యోగులు, ఉద్యోగుల సంఘాల నాయకులు, ఆదివాసీ ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువత దీన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో వెంకట్రావు, ఆదివాసీ జేఏసీ నాయకులు తెల్లం శేఖర్, కారం రామన్న దొర తదితరులు ఉన్నారు.

కూనవరంలో...



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

కూనవరం, (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్స వాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సరియం అనిల్‌కుమార్ అన్నారు. టేకులబోరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతీ గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆదివాసీల జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ అధ్యక్షులు కట్టం వీరయ్య, చిచ్చుడి జితేంద్ర, కుంజం జితేంద్ర, కారం సత్యనారాయణదొర, కొమరం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

రంపచోడవరం, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించేదుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ శనివారం ఆదివాసీ దినోత్సవాన్ని స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ)లో నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఏజెన్సీ ఏడు మండలాల్లోని ప్రధాన కేంద్రాల్లో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఏటీడబ్ల్యువోలకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

అత్యాచారం కేసులో బాలనేరస్తుడికి జైలు

రంపచోడవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన బాలికపై అత్యాచారం చేసిన కేసులో గిరిజనబాల నేరస్తుడికి రెండేళ్ల శిక్ష ఖరారు చేస్తూ రాజమహేంద్రవరం జువైనల్ కోర్టు మేజిస్ట్రేట్ చావలి రమ్య గురువారం తీర్పు చెప్పారు. మండలంలోని వేములకొండ గ్రామానికి చెందిన బాలికను, అదే గ్రామానికి చెందిన బాల నేరస్తుడు మాయమాటలు చెప్పి అడవిలోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. ఈ కేసును అప్పటి ఏఎస్పీ కృష్ణకాంత్ పటేల్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో బాల నేరస్తుడికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ రాజశేఖర్ వాదనలు వినిపించగా కోర్టు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ శేషు, కోర్ట్ మోనిటరింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ముక్తేశ్వరరావు సాక్షులను ప్రవేశపెట్టారు.

తల్లిపాల వారోత్సవాలు

మోతుగూడెం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): లక్కవరంలో చదలవాడ సబ్ సెంటర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. తులసిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఉదయ్‌కుమార్ రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై మాట్లాడారు. మలేరియా నివారణ చర్యలపై ఆయన అవగాహన కూడా కల్పించారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి జాతర

విఆర్‌పురం, అగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌పురం గ్రామంలో గురువారం నుంచి మహాలక్ష్మి అమ్మవారి బండికొలుపుల జాతరను వైభవంగా ప్రారంభించారు. గురువారం ఉదయం అమ్మవారి మండపం వద్ద దేవారులతో ప్రజల సమక్షంలో ప్రారంభించారు. తరువాత మేళతాళాలు, దేవారుల మధ్య గ్రామంలోని పురవీధుల ద్వారా గ్రామస్తుల సమక్షంలో కావిడి మోసుకుంటూ ఇంటింటికి వెళ్లి మజ్జిగని కుండలలో నింపుకుంటూ గ్రామ పొలిమేరల్లో తలతోరణాలు కట్టి సంబరాలు ప్రారంభించారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరిపించే ఈ జాతర ఐదు రోజులపాటు వైభవంగా నిర్వహిస్తారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

కూనవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దంపతులు మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. కూనవరం మండలం పంద్రాజుపల్లి గ్రామానికి చెందిన కారం దుర్గ వినోద్ దంపతుల కుమార్తె షణ్ముఖ ప్రియ(5) అనారోగ్యం బారిన పడడంతో మెరుగైన వైద్యం అవసరమయ్యింది. ఈ విషయాన్ని స్థానిక టీడీపీ నాయకులు గడ్డిపాటి ప్రసాద్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే చొరవతో పాపను మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పాప పరిస్థితి విషమించి చనిపోయింది. పాపను ఇంటికి తీసుకు రావడానికి కుటుంబ సభ్యుల వద్ద డబ్బులు లేకపోవడంతో ఈ విషయాన్ని ప్రసాద్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే దంపతులు వారికి చెందిన మహాప్రస్థానం వాహనాన్ని ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

ఆదివాసీ హక్కులను పరిరక్షించాలి

ఎటపాక, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ డివిజన్ నాయకులు దాసరి సాయన్న డిమాండ్ చేశారు. గురువారం తునికి చెరువు గ్రామంలో 9 జరిగే ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆయన కరపత్రాలు ఆవిష్కరించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో లక్ష్మీపురం గ్రామంలో నవోత్సవాల్లో భాగంగా ఏఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడారు. ఆదివాసీ దినోత్సవాన్ని రావాలంటూ ఆదివాసీ టాప్ టెన్ టీం సభ్యులు పాఠశాలలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగస్తులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

ఢిల్లీ సెమినార్‌లో వై.రామవరం ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నీతి అయోగ్ సారధ్యంలో గురువారం న్యూఢిల్లీలో జరిగిన బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్‌కు వై.రామవరం ఎంపీడీవో కె.బాపన్నదొర హాజరయ్యారు. ఈ సెమినార్‌లో వై.రామవరం మండలం భౌగోళిక స్థితిగతులను వివరిస్తూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.

వై.రామవరంలో కుండపోత వర్షం

మండలంలో గురువారం కుండపోత వర్షం కురిసింది. పలు లోతట్టు ప్రాంతాల్లో వాగులు పొంగడంతో గిరిజనుల రాకపోకలు నిలిచాయి. ఈ వర్షానికి ప్రజలు ఊరట చెందారు.

రైతు ఉత్పత్తిదారు సంఘాలు బలోపేతం కావాలి

రైతు ఉత్పత్తిదారు సంఘాలు బలోపేతమై తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని హీపర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీత అన్నారు. గురువారం వెలుగు కార్యాలయం వద్ద ఎఫ్‌పిఓ బిజినెస్ ప్లాన్‌పై అవగాహన కల్పించారు. అనంతరం అటవీశాఖ, రూరల్ ఎన్‌లైన్‌మెంట్, అగ్రికల్చర్ సంయుక్తంగా మొక్కలు పంపిణీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎం.నాగేశ్వరరావు, బాబురావు, శ్యామల, వెంకట్రావు, రైతు సంఘాలు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

శాంతి ఆశ్రమంలో 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల ఉన్న శాంతి ఆశ్రమంలో రూ.3.6కోట్లతో నూతనంగా 33/11కేవీ ఉపకేంద్రం ఏర్పాటు ద్వారా పరిసర గ్రామాల విద్యుత్ సమస్య పరిష్కారం కానుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. శాంతి ఆశ్రమం హైస్కూల్ వెనక ఖాళీ ప్రదేశంలో గురువారం ఉపకేంద్ర పనులకు శ ంకుస్థాపన చేసి శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 20ఏళ్లుగా శాంతి ఆశ్రమ పరిసర గ్రామాల ప్రజలు విద్యుత్ ఉప కేంద్రం కోసం ఎదురుచూస్తున్నారని, ఆ కల నెరవేరే సమయం ఆసన్నమైందన్నారు. ఈ విద్యుత్ ఉపకేంద్రం వల్ల యుజేపురం, శరభవరం, పోతులూరు, వెంకటనగరం, తోటపల్లి, చింతలూరు, బవురువాక, తాడువాయి, కె.కొత్తపల్లి గ్రామాలకు సజావుగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. జగ్గంపేట ఈఈ వీరభద్రరావు మాట్లాడుతూ రెండు నెలలో ఈ విద్యుత్ ఉప కేంద్రాన్ని పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, మేడిశెట్టి సూర్యకిరణ్, బద్ది రామారావు, జింకల తాతారావు, ఎస్.సీతారాం, రేమాల అప్పలరాజు, బందెల సత్యనారాయణ, సర్పంచ్‌లు రొంగల నాగేశ్వరరావు, అమరాది వెంకట్రావు, మాజీ ఉపసర్పంచ్ పెండ్యాల శివశంకర్,మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు, ఏడీఈ రాజశేఖర్, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా రత్నగిరి వనదుర్గ



అన్నవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గమ్మవారి శ్రావణమాసోత్సవాలలో బాగంగా నాల్గవరోజైన గురువారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులను దర్శనమిచ్చారు. అన్నార్తుల ఆకలితీర్చే దేవతగా భక్తులను అనుగ్రహించారు. ఈసందర్భంగా ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. జపములు, పారాయణలు, హోమములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రాహ్మణసంఘం తరుపున అమ్మవారికి సారె, చీర,పళ్లు,పువ్వులు, గాజులు తదితరవాటిని అమ్మవారికి ఊరేగింపుగా తీసుకునివెళ్లి సమర్పించగా అమ్మవారి చెంత వీటన్నింటినీ ఉంచి అర్చకస్వాములు పూజలు చేశారు.

భావరంలో మెడికల్ క్యాంప్

ఇంటింటికి సర్వే చేసిన ఆరోగ్య సిబ్బంది.. ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



జ్వరంతో బాధపడుతున్న వ్యక్తికి పరీక్ష నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

జగ్గంపేట రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): 'డెంగ్యూ జ్వరాలు' అనే శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఆరోగ్య సిబ్బంది మూడు బృందాలుగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి జ్వరాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏడుగురు జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. పంచాయతీ అధికారులతో కలిసి వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి చెత్తను తొలగింపచేశారు.

ఆయిల్‌పామ్‌తో రైతులకు అత్యధిక ఆదాయం

గండేపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నాయకంపల్లి గ్రామంలో ఉద్యానశాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్‌పామ్ కంపెనీ ఆధ్వర్యంలో గ్రామంలోని రైతులకు ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పతంజలి డీజీఎం ఏఎస్ ప్రకాష్ మాట్లాడుతూ పామాయిల్ తోటల సాగులో కొత్త విధానాలు అవలంబించడం ద్వారా రైతులు అత్యధిక ఆదాయం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి ఎ.శ్రీవల్లి, వీఏఏ సురేఖ, వీర్రాజు, టి.మణికంఠ, వి.బాలాజీ, రామకృష్ణ పాల్గొన్నారు.

పంట నమోదు ప్రక్రియ

గండేపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గండేపల్లిలో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. కంటిపూడి నరేంద్రబాబు, ఆళ్ల వీరవెంకటసత్యనారాయణ పంటలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. యూరియాను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఆయన వెంట వీఏఏ సత్యనారాయణ, టీడీపీ గ్రామాధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ, ఆళ్ల సత్తిబాబు ఉన్నారు.

వినూత్నరీతిలో మొండి బకాయిల వసూలు



బకాయిలు వసూలు కోసం ప్లకార్డులు పట్టుకుని వెళ్లిన బ్యాంకు ఉద్యోగులు

గండేపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గండేపల్లి సహకార బ్యాంక్ ఉద్యోగులు వినూత్న రీతిలో మొండి బకాయిలను వసూలు చేయడానికి ప్లకార్డులు పట్టుకుని గురువారం బకాయిదారుల ఇంటింటికి తిరిగారు. ఆర్‌పీఎం టీం ద్వారా బకాయిదారుల ప్రతీ ఇంటికి ప్లకార్డులు పట్టుకుని వెళ్లారని బ్రాంచ్ మేనేజర్ రాధాకృష్ణ తెలిపారు. మొండి బకాయిలు వసూలైతే బ్రాంచ్ ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఏజీఎం డి.యేసునాథు, నోడల్ ఆఫీసర్ వి.రమణమూర్తి, సూపర్‌వైజర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

ఏలేశ్వరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతీ ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని బీజేపీ సీనియర్ నాయకులు కొల్లా శ్రీనివాస్ అన్నారు. గురువారం సిరిపురంలో హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఆగస్టు 3నుంచి 15వరకు ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి జాతిసమైఖ్యతను చాటాలన్నారు.

పేదలకు సీఎం సహాయ నిధి భరోసా



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న జ్యోతుల నవీన్‌కుమార్

జగ్గంపేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. స్థానిక రావ లమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో గురు వారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నవీన్ అందజేశారు. జగ్గంపేట మండలానికి 24 మందికి, కిర్లంపూడి మండలానికి చెందిన తొమ్మిది మందికి, గండేపల్లి మండలానికి చెందిన ఎనిమిది మందికి రూ.29.70లక్షలు అందజేశారు. ఇప్పటికే 200మందికి ఆర్థిక సాయం అందించామన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, టీడీపీ జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల అధ్యక్షులు జీను మణిబాబు, పోతుల మోహనరావు, వీరం రెడ్డి కాశీబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు మారిశెట్టి భద్రం, పరిమి బాబు, కందుల చిట్టిబాబు, దేవరపల్లి మూర్తి, అడబాల వెంకటేశ్వరరావు, అనుకూల శ్రీకాంత్, పాండ్రంగి రాంబాబు, నీలం శ్రీను, సొసైటీ చైర్మన్లు కంటిపూడి సత్యనారాయణ, కందుల కొండయ్య చౌదరి, ఉప్పలపాటి వెంకటేశ్వరరావు, రేఖ బుల్లి రాజు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, బస్వా చిన్న బాబు, మునిరెడ్డి నాగేశ్వరరావు, కురుకూరి వీర వెంకటచౌదరి, యల్లమిల్లి సీఎం తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో పార్కు ప్రారంభం



ప్రత్తిపాడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో విజయదుర్గ ఆలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన పార్కును గురువారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ప్రారంభించారు. పార్కు మధ్యలో వాటర్ ఫౌంటేయిన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి ఫౌంటెన్ కట్టడంపై గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. పార్కు లోపల, బయట ఎమ్మెల్యే, కూటమి నాయకులు మొక్కలు నాటారు. రూ.1.20కోట్లతో నూకాలమ్మ గుడి వద్ద నిర్మించిన వాటర్ ట్యాంకులను, పైపులైన్ విస్తరణ పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మవరం గ్రామాభివృద్ధికి తోడ్పాటు, సహకారం అందిస్తామని తెలిపారు. సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, సొసైటీ చైర్మన్ దాసం శేషారావు, గ్రామపెద్దలు దాట్ల అప్పన్నబాబు, బొల్లు కొండబాబు, జువ్వల బాబులు, కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, మేడిశెట్టి సూర్యకిరణ్, బొల్లు వెంకటేశ్వరరావు, పుణ్యమంతుల రాజా, రామిరెడ్డి ప్రసాద్, పంపనబోయిన ఏసుబాబు పాల్గొన్నారు.

వరుణుడి కోసం పూజలు

కోటనందూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వర్షాల కోసం కోటనందూరు గ్రామంలో టీడీపీ సీనియర్ నేత వెలగా వెంకటకృష్ణారావు అధ్వ ర్యంలో వరుణ జపం చేశారు. రెండు నెలల నుంచి వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతుండటంతో వారితో కలసి పూజలు చేశారు. ముందుగా శ్రీవరసిద్ధి వినాయకుడికి, శ్రీకృష్ణుడు, శ్రీసీతారామాంజనేయులు, శ్రీసాయిబాబా, శ్రీనూకాలమ్మ తల్లి, శ్రీగొంతెమ్మతల్లి, శ్రీతాళ్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి జలాభిషేకం నిర్వహించారు.

పెద్దశివాలయానికి ట్రస్టు బోర్డు ఏర్పాటు

తునిరూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తునిలోని గవరపేట పెద్ద శివాలయానికి ట్రస్టుబోర్డు ఏర్పాటు చేస్తూ దేవదాయ ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం తొమ్మిది మందితో ట్రస్టు బోర్డును ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే యనమల దివ్య శివాలయం ట్రస్టు బోర్డు సభ్యులను అధికారికంగా ప్రకటించారు. ట్రస్టు బోర్డు సభ్యులుగా రాజా నల్లపురాజు సుభద్రమ్మ, ఎం.గౌరీశంకర్‌విశ్వనాథ్, కోట్ల పద్మిని, వేగి అమల, సుజాత, చేబ్రోలు సత్యవతి, దాసరి నాగరాజు, వైవీవీసత్యనారాయణ, కొండవీటి రామలింగేశ్వరశర్మ ఎన్నికయ్యారు.

ఖాదీ వస్త్రాలను ప్రోత్సహించాలి

ఏలేశ్వరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఖాదీ వస్త్రాలను ప్రోత్సహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత పేర్కొన్నారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక విభాగం నేతృత్వంలో ఖాదీ వస్త్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాంస్కృతిక విభాగం కన్వీనర్ వీరభద్రరావు, శ్రీలక్ష్మీ, అధ్యాపకులు ప్రగడ ప్రయాగమూర్తి, బంగార్రాజు, సతీష్ పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం

కిర్లంపూడి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని సీడీపీవో పూర్ణిమ అన్నారు. గెద్దనాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిల్లంగి సెక్టార్ సూపర్‌వైజర్ బూసమ్మ ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

పామాయిల్ సాగుతో లాభాలు

శంఖవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చునని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. నెల్లిపూడిలో పామాయిల్ తోటలు విస్తరణ మహోత్సవంలో భాగంగా మద్దుకూరి పెదకాపు పొలంలో ఉద్యానశాఖ, పతంజలి ఫుడ్స్ అధికారులతో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మైక్రో ఇరిగేషన్ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. జిల్లా సూక్ష్మ సేద్య అధికారి (డిఎమ్ఐఓ) జి.వరప్రసాద్ మాట్లాడారు. ఎఎమ్‌సీ చైర్మన్ బద్ది మణి రామారావు, పర్వత సురేష్, వెన్నా శివ, కె.సురేష్, గంటా బాలుదొర, వీర్ల సూరిబాబు, గాబు సుభాష్ పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖోఖో పోటీలు

తునిరూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో క్లస్టర్-7(ఆంధ్ర, తెలంగాణ) సీబీఎస్ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 9 నుంచి 11 వరకు అండర్-14, అండర్-19 బాలురు , బాలికల విభాగంలో ఖోఖో పోటీలు జరుగుతాయని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలియజేశారు. ఈ పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ నుంచి 1800 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. వీరికి ఖోఖో కోర్టులు, వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఉద్యోగులకు సత్కారం

కిర్లంపూడి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసినప్పుడే వారి మన్ననలు పొందుతారని టీడీపీ మండలాధ్యక్షుడు వీరంరెడ్డి కాశీబాబు అన్నారు. గురువారం భూపాలపట్నం సచివాయలంలో ఉద్యోగులు బదిలీపై వెళ్తుండగా వారిని సత్కరించారు. అంతరం వార్డు మెంబర్లు ఉద్యోగులను నూతన వస్త్రాలు అందజేశారు.



చెత్త సంద కేంద్రం వద్ద సిబ్బందికి సూచన చేస్తున్న డీఎల్పీఓ

చెత్త సంపద కేంద్రాల పరిశీలన

తొండంగి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండంగి, ఏ కొత్తపల్లి గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను డీఎల్పీవో బాలామణి గురువారం పరిశీలించారు. ఐవీఆర్ఎస్ ద్వారా పారిశుధ్యంపై ప్రజల అభిప్రాయాలను సేకరించినపుడు ఏ కొత్తపల్లి గ్రామం నుంచి అతి తక్కువ స్పందన ప్రజల నుంచి రావడంతో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. చెత్త సంపద కేంద్రాలకు చెత్తను తరలించాలన్నారు. బహిరంగ ప్రదేశాలల్లో చెత్తను వదిలితే చర్యలు తప్పవన్నారు. నిరంతరం వీధుల్లో పారిశుధ్యం పరిస్థితిని గమనించి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సిబ్బందికి సూచించారు. ఇన్‌చార్జి ఈవోఆర్డీ ప్రేమ్ కుమార్, కార్యదర్శి రాము తదితరులు ఆమె వెంట ఉన్నారు.

భవన నిర్మాణంపై అధికారులు విచారణ



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న తుని కమిషనర్

ఏలేశ్వరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు భవనాలను అనుమతి లేకుండా నిర్మిస్తున్నారని స్థానికులు మెంటా నాగేశ్వరరావు, పైల సుభాష్ చంద్రబోస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణాధికారిగా తుని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు గురువారం ఏలేశ్వరంలో విచారణ చేపట్టారు. ముందుగా భవనాన్ని పరిశీలించిన ఆయన తరువాత ఫిర్యాదుదారులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. వెంకట్రావు మాట్లాడుతూ ఫిర్యాదుదారుల నుంచి వివరాలు స్వీకరించామని పూర్తిస్థాయిలో నివేదికను మున్సిపల్‌శాఖ రీజనల్ డైరెక్టర్‌కు అందజేస్తామన్నారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాన్ని అడ్డుకోమని ఏలేశ్వరం నగర పంచాయతీ కమీషనర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కేవలం నోటీసులు ఇచ్చి ఊరుకున్నారని విమర్శించారు. ఇకనైనా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఫిర్యాదుదారులు కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతిపై కేసు నమోదు

తునిరూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్లప్రోలు-పిఠాపురం స్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. దీనిపై గురువారం తుని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. వివరాలు తెలియలేదని ఎరుపు రంగు చొక్కా, సిమెంట్ కలర్ ఫ్యాంట్ దుస్తులు ధరించి ఉన్నాడన్నారు. వివరాలు తెలిస్తే 9490619020 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎక్స్‌లెన్స్ అవార్డు విభాగంలో 'ఆదిత్య'కు మూడో స్థానం



గండేపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం ఎక్సలెన్స్ అవార్డు విభాగంలో ఆదిత్య విశ్వవిద్యాలయం 3వ స్థానాన్ని సాధించిందని ప్రోచాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్ రాడిసన్‌లో జరిగిన కేంబ్రిడ్జ్ సమన్వయకర్తల వార్షిక సమావేశంలో ఈఅవార్డును ఆదిత్య యూనివర్శిటీ ప్రతినిధి డాక్టర్ తెలుగు నీలిమ స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ఆదిత్య విశ్వవిద్యాలయంలో అభ్యాసకుల అవసరాలకు అనుగుణంగా మాడ్యూల్ విజయవంతమైనందుకు అవార్డు లభించిందన్నారు. మూడో స్థానం పొందడంపై డాక్టర్ ఎన్.శేషారెడ్డి, ప్రో చాన్సలర్ సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

'ఆదిత్య'లో వర్క్‌షాప్

గండేపల్లి, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఎంట్రపెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గురువారం స్టార్టప్‌లకు ఐడియా మరియు ఇన్నోవేషన్ అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. దీని ద్వారా యువ మేధస్సుల్లో వ్యాపార చింతనను ప్రేరేపించడం, స్టార్టప్ అభివృద్ధికి అవసరమైన ప్రాథమిక పాఠాలు అందించడం లక్ష్యంగా నిర్వహించారని వివరించారు.

టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



జగ్గంపేట రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాజపూడి గ్రామానికి చెందిన నంగన శ్రీనివాసరావు టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. సామాన్య కార్యకర్తగా పనిచేస్తున్న తనను గుర్తించి టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమించడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. బీసీల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

అదృశ్యమైన మహిళ బంధువులకు అప్పగింత

గండేపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు గ్రామానికి చెందిన ఒక అవివాహిత ఈనెల1న అదృశ్యమైంది. దీనిపై గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్ఐ శివనాగబాబు విచారణ చేపట్టారు. ఆమె హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి ఆమెను గండేపల్లి తీసుకువచ్చి బంధువులకు అప్పగించారు.

శ్మశానవాటికలో షెడ్లు ఏర్పాటు చేయాలి

ప్రత్తిపాడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు శ్మశాన వాటికలో షెడ్లు ఏర్పాటు చేయాలని వీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను తహసీల్దార్ సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబులకు గురువారం వినతిపత్రం అందజేశారు. కనీస సౌకర్యాలు లేక అంత్యక్రియలు కష్టసాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఇరుగుల చక్రం, కోటేశ్వరరావు, ఎం.అప్పన్న, ఎన్.నాగేంద్ర, సలాది దొరబాబు పాల్గొన్నారు.

మార్కెట్‌కు శ్రావణ శోభ



ఏలేశ్వరం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కు శ్రావణ శోభ వచ్చింది. నగరంలో ఏ దుకాణం చూసినా మహిళల రద్దీ కనిపించింది. వరలక్ష్మీ వ్రతానికి కావల్సిన పూజా సామగ్రి, పండ్లు, పత్రి, పువ్వులు, బంగారు రూపులు వంటివి కొనుగోలు చేసేందుకు గురువారం దుకాణాలకు పోటెత్తారు. వస్త్ర దుకాణాలు, బంగారం దుకాణాలు ఆఫర్లు ప్రకటించడంతో మహిళల ఆసక్తి చూపారు. పట్టణంలో ఉన్న దుర్గాదేవి ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు.